ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 31 | సంచిక : 5 | జనవరి 2026

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 48

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా: రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

హృదయ కుహర మధ్యే .............................. 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ....... 6

ప్రసాద బుద్ధి ........................................ 33

Where the Journey ends in Silence!

మౌనంలో ముగిసిన ప్రయాణం .................. 34

Nityam - Leela నిత్యం – లీల.................. 42

ఇతర విషయములు :

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం .... 48



భగవంతుడు నిన్ను అంతర్ముఖం
చెయ్యడానికి, అనేక కోణాలలో
నుండి నిన్ను హృదయములోనికి
తీసుకుపోవడానికి ఎన్నో
ప్రయత్నాలు చేస్తాడు.
ఎందుచేతనంటే ఆయన
మనకు ఆధ్యాత్మిక తండ్రి.

# హృదయ కుహర మధ్యే....

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)**

భగవాన్ స్కందాశ్రమంలో ఉండగా, ఒక పండితుడు హృదయ కుహర మధ్యే అని వ్రాసి తరువాత ఏమి వ్రాయాలో తెలియక దానిని భగవాన్ ప్రక్కన పెట్టి టౌనులోకి వెళ్ళారు. ఆయన తిరిగి వచ్చేసరికి భగవాన్ ఆ శ్లోకాన్ని పూర్తిచేసి, క్రింద మాత్రం ఆ పండితుని పేరే పెట్టారు. అదేమిటి స్వామీ అంటే, మొదలుపెట్టినది నీవే కదా అన్నారు భగవాన్. సమస్త మతముల సారము, వేదాంత సారము అంతా ఇందులో ఉంది.

**హృదయ కుహర మధ్యే కేవలం బ్రహ్మమాత్రం**
**హ్యహమహమితి సాక్షాత్ ఆత్మరూపేణ భాతి।**
**హృదివిశ మనసా స్వం చిన్వతా మధ్యతావా**
**పవన చలన రోధాత్ ఆత్మ నిష్ఠోభవత్వం॥**

హృదయకుహర మధ్యే కేవలం బ్రహ్మమాత్రం – భగవాన్ చెప్పే హృదయకేంద్రం, ఆధ్యాత్మిక హృదయం, మాంసంతో కూడిన, స్మశానంలో కాలిపోయే గుండె కాదు... ఈ ఆధ్యాత్మిక హృదయానికి దేహానికి అణుమాత్రం కూడా సంబంధము లేదు. ఆ హృదయ గుహలో ఉన్న బ్రహ్మమే నీవు. అక్కడ నీ దేవతలు, సృష్టి, జాతి, మతము, ఈ మనస్సు కల్పించినవి ఏమీ లేవు. కేవలం బ్రహ్మ మాత్రం! రెండో దానికి స్థానం లేదు అక్కడ. 'నేను' 'నేను' అని కేవలం బ్రహ్మము ఒక్కటే ప్రకాశిస్తోంది. అక్కడ లింగబేధం, రంగుబేధం, కులగోత్రాల బేధం ఏమీ లేవు. అక్కడ దేశకాలాలు లేవు, సృష్టి లేదు. ఉన్నది ఒక్కటే – బ్రహ్మము! ఈ దేహము ఉన్నా రాలిపోయినా అది ఉంటుంది, ఎక్కడికీ పోదు. ఈ దేహ స్పర్శతోటి, మనస్సులో ఉన్న గొడవలతోటి దానికి సంబంధము లేదు. దానికి సూర్యుడి వెలుతురు, చంద్రుడి వెన్నెల అక్కరలేదు. అది స్వయముగా, తనంతట తానుగా ప్రకాశిస్తోంది.

రంగులు, మతాలు వేరైనా, స్త్రీ అయినా, పురుషుడైనా, పండితుడైనా, పామరుడైనా, నీకు తెలిసినా, తెలియకపోయినా, నీ దేహం చనిపోయినా, చావులేని సద్వస్తువు ఒకటి ప్రతి

జీవి హృదయంలోనూ ఉంది. దానిని బుద్ధుడు నిర్వాణసుఖం అని, హిందువులు మోక్షసుఖం అని, క్రీస్తు స్వర్గరాజ్యం అని చెప్పారు. ఒక్కో మతం ఒక్కో పేరు పెట్టింది కాని ఉన్నస్థితి ఒక్కటే. ఆ వస్తువు అనుభవంలో ఉన్నవాడికి ఈ సృష్టి అంతా తన స్వరూపంగా కనబడుతుంది. వాడికి బేధభావన ఉండదు. ఆ వస్తువు అనుభవంలో లేనివాడు ప్రపంచాన్ని అంతా వేరుగా చూస్తాడు. ఆ బేధభావనలో నుండి అసూయ, భయం, కోపం, కామం, మానవుడు పతనం అవ్వటానికి అన్ని చెడుగుణాలు వస్తాయి. ఆ బేధభావనలో నుండి విడుదల పొందాలంటే, నీ హృదయంలో ఉన్న చావులేని వస్తువు గురించి తెలుసుకోవాలి. దాని గురించి అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, అనుభవంలోనికి తెచ్చుకోవాలి.

ప్రతీ మనిషికి లోపలి నుంచి నేను అనే తలంపు వస్తోంది. ఆ నేను అనే తలంపు వచ్చాక ఇతర తలంపులు వస్తున్నాయి. అది నీ లోపల ఎక్కడ ఉదయించి వస్తోందో, దానినే హృదయం అని వేదం చెపుతోంది. ఇప్పుడు మనకు నేను అంటే దేహం స్ఫురిస్తోంది, తెలివి స్ఫురిస్తోంది, ఇష్టాయిష్టాలు స్ఫురిస్తున్నాయి. కానీ ఈ తెలివికి, మనస్సుకి, దేహానికి అణుమాత్రం కూడా సంబంధం లేకుండా ఒక చావులేని వస్తువు నీ హృదయంలో ఉంది. అది ఎవరో కాదు. అది నీవై ఉన్నావు. నీవు ఏ వృత్తిలో ఉన్నప్పటికీ నువ్వు ఎవరో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నం మానవద్దు. నీ దేహం సంసారంలో ఉండవచ్చు, సమాజంలో ఉండవచ్చు, కానీ నీ మనస్సుని తీసుకెళ్ళి ఆ హృదయగుహాలో, ఆ బ్రహ్మములో, ఆ ఆత్మలో, ఆ నిజమైన దేవుడిలో ముంచు. అలా ముంచినప్పుడు ఆధ్యాత్మికముగా నువ్వు పుడతావు. నీ హృదయంలో ఉన్న చైతన్యం నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు, దానికి సంబంధించిన సుఖం, శాంతి, ఆనందం నీకు సొంతం అవుతాయి. నీ హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికి మూడు మార్గములు చెప్పారు.

### 1. విచారణా మార్గం :

మనం నేను, నేను అంటున్నాము. అది నిజమైన నేను కాదు. అది ఉదయం లేస్తుంది, గాఢనిద్రలో దాని పుట్టింటికి, అంటే హృదయగుహాలోకి వెడుతోంది. హృదయగుహాలో ఎప్పుడైతే పడిపోయిందో, అక్కడ ఉన్న సుఖం, శాంతి మనకు తెలుస్తాయి.

ఆ సుఖం ఉదయం ఈ నేను లేచే వరకు ఉంటుంది. అక్కడ నుండి ఈ నేను అనే సైతాను గొడవలు అన్నీ తీసుకొస్తుంది. నిజమైన నేను ఒకటిగా ఉంటుంది. అబద్ధమైన నేను అనేకంగా ఉంటుంది. ఒకటిలో నుండి భయం, కామం, దుఃఖం రాదు. ఇద్దరు ఉన్నచోటే అన్నీ వస్తాయి. గాఢనిద్రలో ఒకటిగా ఉన్నాము కాబట్టి ఆనందంగా ఉన్నాము. మెలకువ వచ్చాక రెండు, మూడు, నాలుగు అయిపోయాము, అనేకం అయిపోయాము. అబద్ధమైన నేను, దేహగతమైన నేను పోవటం వలన నీవు పోవు, నిజమైన నేను మీకు దొరుకుతుంది. ఇప్పుడు మనం స్వతంత్రులము కాదు, అబద్ధమైన నేను చెప్పినట్టు గంతులు వేస్తున్నాము. హృదయంలో ఉన్న నిజమైన నేను అనుభవంలోనికి వస్తే మీకు స్వాతంత్ర్యము వస్తుంది. ఇప్పుడు ఖండంగా ఉన్నావు. అప్పుడు అఖండముగా ఉండవచ్చు, జనన మరణముల నుండి విడుదల పొందవచ్చు. ఈ నేను గురించి విచారణ చేసి దానిని తొలగించుకున్న తరువాత, నీ హృదయగుహలో ఉన్న వస్తువు నీకు అందుతుంది. అబద్ధమైన నేను పోవటం వలన నీవు ఎవరో నీకు తెలుస్తుంది.

## 2. ధ్యానం :

ధ్యానం చేసి కూడా ఆ వస్తువును తెలుసుకోవచ్చు. మానవుడి యొక్క స్వార్థం, కుయుక్తులు, కుతంత్రాలు, కుచేష్టలు, మనస్సుని హృదయాభిముఖంగా ప్రయాణం చేయకుండా పట్టి ఉంచుతాయి. ధ్యానము చేయగా చేయగా నీ మనస్సులో ఉన్న దోషములు నశిస్తాయి. ధ్యానం చేయటం వలన నీ మనస్సులో ఉన్న అల్పత్వం పోయి నీ మనస్సుకు తూకం వస్తుంది. మనస్సు ఎప్పుడైతే లోపాల నుండి, అలవాట్ల నుండి విడుదల పొందిందో, తనంతట తానుగా అది హృదయగుహలో పడిపోతుంది.

## 3. ప్రాణాయామం :

భగవంతుడు నీకు రెండు శక్తులు ఇచ్చాడు – ప్రాణం, మనస్సు. మనస్సుతో ఆలోచించుకుంటాము. ప్రాణశక్తి వలన పనులు చేస్తాము. ఈ రెండింటికీ లోపల మూలము ఒక్కటే. ప్రాణాన్ని నిరోధించటం వలన మనస్సు నిగ్రహించబడుతుంది. మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి కలిగిన మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణించి

హృదయంలో ఐక్యమవుతుంది.

మనస్సుని తీసుకెళ్ళి హృదయములో లయం చేయటానికి, హృదయములో ఏకాగ్రం చేయటానికి కేవలము కర్మమార్గము, భక్తిమార్గము, ధ్యానమార్గము, జ్ఞానమార్గము, ఈ నాలుగు మార్గాలే కాదు, మీ మనస్సుని తీసుకెళ్ళి హృదయములో ముంచటానికి భగవద్గీతలో కృష్ణుడు వేలాది ఉపాయాలు గుమ్మరించాడు. నీకు నచ్చిన మార్గాన్ని అనుసరించి, నీ మనస్సుని తీసుకువెళ్ళి అందులో ముంచు.

నీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉందని చెప్పటానికి ఋజువులు, సాక్ష్యాలు అక్కరలేదు. అది ఉండటం వలననే తెలియబడుతుంది. ఆ వస్తువుతోటి సాంగత్యం కుదిరితే, బాహ్యంగా ఉన్న యోగులతోటి, మహర్షులతోటి సాంగత్యం నీకు అవసరం లేదు. ఈశ్వరానుగ్రహం ఉన్నవారికి, పుణ్యబలం ఉన్నవారికి, పూర్వజన్మలలో సత్కర్మ చేసినవారికి లోపల హృదయంలో ఉన్న సత్యవస్తువుతో అనుబంధం కుదురుతుంది. అది అందరికీ సాధ్యం కాదు. ఆ సత్యవస్తువు ఎవరికైతే అనుభవంలో ఉందో, వారితో సహవాసం చేస్తే బ్రహ్మానుభవం పొందటానికి నీకు ఏ అలవాటు అయితే అడ్డువస్తున్నాయో అవి నీకు తెలియకుండా రాలిపోతాయి. నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా, మహాత్ముల సహవాసంతో వలన ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతావు. వారి ప్రభావం వలన నీవు కూడా అంతటి వాడవు అయిపోతావు.

భగవంతునితో మానసికఅనుబంధం ముఖ్యం. భగవంతుని నీ మనస్సులో స్మరించగా స్మరించగా పవిత్రత, ఏకాగ్రత వస్తుంది. అప్పుడు బ్రహ్మము తనంతట తానుగా వచ్చి నిన్ను వరిస్తుంది. నువ్వు కంగారు పడవద్దు, అసహనంగా ఉండవద్దు. భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని అభివృద్ధిలోకి రావాలంటే సహనం అవసరం. సహనం లేకుండా ఏదీ సాధించలేము. కేవలం నీ తెలివితేటలు వలన నీవు ఉద్దరింపబడవు. నీవు ప్రయత్నం చేయాలి, కాలం కలసి రావాలి, ఈశ్వరానుగ్రహం కలగాలి. ఇవి మూడు ఉంటేనే నీవు ఒడ్డుకు వస్తావు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 27 జూన్ 1996, నరసాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మన పెద్దలు, మన వైదిక ఋషులు అందరూ చెప్పేది ఏమిటి అంటే, బ్రహ్మమే ఆనంద స్వరూపం, బ్రహ్మమే సత్య స్వరూపం, బ్రహ్మమే జ్ఞాన స్వరూపం. వేడి లేకుండా అగ్ని ఉండదు, అలాగే ఆనందం లేకుండా బ్రహ్మం ఉండదు. పారమార్థికసత్యం బ్రహ్మం మాత్రమే, మిగతావి అన్నీ వ్యవహారికసత్యాలు మాత్రమే. ఏ విద్య వల్ల అయితే మనకి బ్రహ్మం తెలియబడుతుందో అదే నిజమైన విద్య అని ఆచార్యస్వాములవారు చెప్పారు. బ్రహ్మం సద్వస్తువు, సత్యవస్తువు, నిత్యవస్తువు. అది ఎక్కడో లేదు నీ హృదయంలోనే ఉంది. అదే నిజమైన నేను. ఇప్పుడు ఏదైతే నువ్వు నేను నేను అంటున్నావో అది మిథ్యా నేను, Artificial "I". నీ శరీరం ఎంత నిజమో ఆ నేను కూడా అంతే నిజం. అది శరీరానికి పరిమితం అయ్యి ఉంటుంది. ఆ శరీరానికి పరిమితం అయిన నేనుని మనం అతిక్రమించాలి. ఆ దేహగతమైన నేనుని దాటి మనం వెళ్ళాలి. భక్తిమార్గం కానీ, జ్ఞానమార్గం కానీ, కర్మమార్గం కానీ, ధ్యానమార్గం కానీ నీ పూర్వజన్మ సంస్కారాలని అనుసరించి, అవలంభించి you must go, you should go, beyond individuality, beyond body bound "I". ఈ మిథ్యా నేనుని దాటి వెళితేనే కానీ, దేహగతమైన నేనుని దాటివెళితేనే కానీ ఆనందస్వరూపమైన బ్రహ్మం నీకు వ్యక్తం కాదు. ఆ బ్రహ్మం ఎక్కడ ఉంది? నీ హృదయంలోనే ఉంది.

రమణాచార్యుడు చెప్పినది ఏమిటి అంటే మన దేహమే దేవాలయం. ఈ దేహం దేవాలయం, నీ ఎదురు రొమ్ముకి కుడివైపున ఉన్నది గర్భాలయం. అక్కడే ఆధ్యాత్మిక హృదయం ఉంది. మనం దేవాలయంలోకి వెళ్ళి ఆగిపోకూడదు, లోపల మూలవిరాట్టు దగ్గరకి వెళ్ళాలి అంటే గర్భాలయంలోకి వెళ్ళాలి. మిగతా సాధనాలు అన్నీ కూడా మనలను దేవాలయం దగ్గరకి తీసుకుని వస్తాయి. దేహగతమైన నేను మరణిస్తేనే కానీ నువ్వు గర్భాలయంలోకి వెళ్ళలేవు. ఆ గర్భాలయంలో బ్రహ్మం ఉంది, అది ఆనందస్వరూపం, జ్ఞానస్వరూపం, సత్యస్వరూపం. వేదం ఏమని చెప్పింది అంటే "సత్యం జ్ఞానం అనంతం ఆనందం బ్రహ్మ"

అని బ్రహ్మం గురించి నిర్వచనం వేదంలో చెప్పబడింది. మనం ఏ పని చేసినా ఆ పనిలో ప్రేమ ఉండాలి, ఏ పని చేసినా అందులో ఏకాగ్రత ఉండాలి, ఆ పని అనేకమందికి హితం కలిగేటట్టుగా ఉండాలి. అంటే అనేకమందికి మేలు కలిగేటట్టుగా ఆ పని ఉండాలి. మన మాట తియ్యగా ఉండాలి, మనం చేస్తున్న పని కూడా తియ్యగా ఉండాలి. తియ్యటి మాటలు మీరు వినండి, అవి చెవుల తోటి వింటారు, ఇంటికి వెళ్ళిన తరువాత పంచదార నోటిలో పోసుకుని చూడండి. మీ మాటలో ఎక్కువ తీపిదనం ఉందా? ఆ పంచదారలో ఎక్కువ తీపిదనం ఉందా అని మీరు చూసుకోండి. భగవంతుడు చెప్పిన మాటల్లోనే మీకు ఎక్కువ తీపిదనం కనిపిస్తుంది, మీరు పరీక్ష చేసి చూస్తే అది మీకు తెలుస్తుంది. అందుచేత ప్రతీపనిలో కూడా మనకి ఏకాగ్రత ఉండాలి, ప్రేమ ఉండాలి, దయ ఉండాలి. ఆ రకంగా పనిచేసుకుంటూ మనం జీవిస్తే మనకి వస్తువు అనుభవంలోకి వస్తుంది. మీ ముఖానికి ఏది అలంకారం అంటే విద్య మాత్రమే అన్నారు ఆచార్యస్వామివారు. మీ దేహప్రారబ్ధాన్ని బట్టి మీకు అధికారం ఉండవచ్చు, ధనం ఉండవచ్చు, విద్య ఉండవచ్చు, వాటిని చూసి నువ్వు గర్వం పొందకు అన్నారు. అంటే ఇవన్నీ కాలప్రవాహంలో కొట్టుకుని పోతాయి. కాలప్రవాహంలో కొట్టుకునిపోయే విషయాలు చూసి నువ్వు గర్వపడకు. భగవదనుభవం పొందడం కోసం నీ చదువుని, నీ ధనాన్ని సద్వినియోగం చేసుకోమన్నారు స్వాములవారు.

మీకు భగవదనుభవం కావాలి అంటే ఒక సూత్రం చెప్పారు ఆచార్యులవారు. లోపల ఉన్న పరిచ్ఛిన్న వస్తువుని కానీ, బాహ్యంగా ఉన్న పరిచ్ఛిన్న వస్తువుని కానీ స్మరించడం మానేయండి అన్నారు. నిరంతరం ఈశ్వరుడినే స్మరించు, ఈశ్వరుడు నీ లోపల ఆత్మరూపంలో ఉన్నాడు, ఆయన నిన్ను కరుణించి కాలక్రమంలో నీ హృదయంలోనే వ్యక్తం అవుతాడు. ఎక్కడో బాహ్యంగా వ్యక్తం అయితే నీకు ఆ రూపం లోంచి, ఆ బాహ్యంగా వ్యక్తం అయిన దేవుడు లోంచి విడిపోవడం తప్పదు. నీ హృదయంలో వ్యక్తం అయిన దేవుడి తోటి ఇరవై నాలుగు గంటలు కూడా నువ్వు కలిసి ఉండవచ్చు. అందుచేత నువ్వు ఈశ్వరుడి యొక్క ప్రీత్యర్థం, ఈశ్వరుడి యొక్క సంతోషం కోసమే నువ్వు పని చెయ్యి. నీ అహంభావన పెంచుకోవడానికి నువ్వు పని చేయవద్దు. భగవంతుడు నీకు ఏదైనాశక్తి ఇస్తే అది ఆయన

కోసమే ఉపయోగించు, భగవదనుభవం పొందడం కోసమే ఉపయోగించు, అంతేకానీ ఆయన నీకు అనుగ్రహించినశక్తిని చూసి నువ్వు గర్వం తెచ్చుకోకు, పొగరుబోతు తనం పెంచుకోకు. ఎందుకంటే ఇవన్నీ కాలప్రవాహంలో కొట్టుకునిపోయేవే. Nothing is too heavy for destiny అన్నాడు వాల్మీకి. అంటే కాలప్రవాహంలో అన్నీ కొట్టుకుని పోతాయి. ఉన్నది ఒక్కటే అది బ్రహ్మమే, మిగతావి అన్నీ కూడా మనోకల్పితములు.

మనస్సు బాహ్యాముఖం అవ్వటానికి నీ రాగద్వేషాలే కారణం. మీ లోపల ఉన్నటువంటి బ్రహ్మముకి రాగద్వేషాలు రావడం లేదు, మీ లోపల ఉన్నటువంటి చైతన్యానికి రాగద్వేషాలు రావడం లేదు. ఈ రాగద్వేషాలు ఎవరికి వస్తున్నాయి అంటే నీలో ఉన్న అజ్ఞానానికే వస్తున్నాయి. "మనస్సు నశిస్తే మోక్షం నీకు అనుభవంలోకి వస్తుంది" అన్నారు ఆచార్యుల వారు. నువ్వు కనుక సాధన చేస్తుంటే అహంభావన నశిస్తుంది. అహంభావన నశిస్తే నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు వ్యక్తం అవుతుంది. అందుచేత అజ్ఞానం నశించకుండా, అవిద్య నశించకుండా, దేహగతమైన నేను నశించకుండా, ఈ మనస్సు నశించకుండా ఎవరికీ మోక్షం రాదు. శివుడిని మనం పూజ చేస్తున్నాం అంటే, విష్ణువుకి మనం పూజ చేస్తున్నాం అంటే అది ఉపాసన కోసం చేస్తున్నాం, ఏకాగ్రత కోసం చేస్తున్నాం. ఈ శివుడు, విష్ణువు అనేది శబ్దంలో బేధమే కానీ వస్తువులో బేధం లేదు. శివుడు అంటే శుభకరుడు అని, విష్ణువు అంటే వ్యాపించినవాడు అని అర్థం. పరమాత్మ శుభాన్ని ఇస్తుంది, వ్యాపించి ఉంటుంది అది. శివుడు అన్నా పరమాత్మే, విష్ణువు అన్నా పరమాత్మే, శబ్దంలో బేధం, వస్తువులో మటుకు బేధం లేనే లేదు. అటువంటి బేధబుద్ధి ఎవరూ పెట్టుకోవద్దు, బేధబుద్ధి పెట్టుకుంటే మోక్షం రాదు కదా మీ నోట్లో దుమ్ము పడుతుంది. అంటే వైదిక దేవతల పట్ల బేధబుద్ధి మనం పెట్టుకోకూడదు. అందరూ మనం నమస్కరింపదగినవారే. అందరి సహకారం మనకి కావలసి ఉంది, అందరి సహకారం మనం పొందవలసినదే. వైదిక దేవతలు ఎవరూ కూడా కుందేటి కొమ్ములు వంటివారు కాదు అని చెప్పారు రమణస్వామి. అంటే అసలు లేని వాళ్ళు కాదు అని. ఈ నేను ఎంత నిజమో, నీ మనస్సు ఎంత నిజమో, వాళ్ళు కూడా అంతే నిజం. దేహగతమైన నేను ఉన్నాను అనుకున్నప్పుడు ఈ ప్రపంచం ఉంది, మరణాంతర జీవితం ఉంది, స్వర్గం ఉంది,

నరకం ఉంది, దేవతలు ఉన్నారు, అందరూ ఉన్నారు. అంటే ఈ పూర్వజన్మలు, రాబోయేజన్మలు, ఈ వైకుంఠం, ఈ కైలాసం, స్వర్గం, నరకం ఈ దేవతలు అందరూ కూడా ఈ దేహగతమైన నేను ఎంత నిజమో అవి కూడా అంతే నిజం అన్నారు. దేవతలని మనం అర్చన చెయ్యడం, దేవతలని పూజ చెయ్యడం ఎందుకు అంటే వారి అనుగ్రహం పొంది మీ లోపల ఉన్నటువంటి బ్రహ్మమును పొందడం కోసమే.

భగవద్గీతలో స్వామివారు ఏమన్నారు అంటే ఏది నిజమో నీకు తెలియకపోయినా, ఏది నిజమో నాకు తెలుసు అక్కడకి తీసుకుని వెళ్ళేవరకు నిన్ను విడిచిపెట్టను అన్నారు. ఏ అవతారపురుషుడిని అయినా నువ్వు ఆరాధించుకోవచ్చు. మనకు రూపదృష్టి, నామదృష్టి ఉంది. ఏదో రూపాన్ని తీసుకుంటాం, ఆరాధిస్తూ ఉంటాం. కేవలం ఆ రూపం మటుకే నిజం కాదు. కానీ ఆ రూపం ద్వారా మనం తరించాలి అని ప్రయత్నం చేస్తున్నాం. ఏ రూపాన్ని ఆరాధించినా, నువ్వు ఏ నామాన్ని స్మరించినప్పటికీ ఏది నిజమో ఆ నిజం దగ్గరకి తీసుకుని వెళ్ళే బాధ్యత నాది అన్నారు స్వాములవారు. నువ్వు చేసేది త్రికరణశుద్ధిగా కనుక చేస్తూ ఉంటే, నువ్వు చేసేది ప్రేమగా చేస్తూ ఉంటే, అంటే మనకు మోక్షకాంక్ష చాలా ముఖ్యం. మన భక్తిని చిల్లరవిషయాలకి వెచ్చించకుండా, మన గురిని మోక్షం వైపే పెట్టుకోవాలి. అంటే నీ అహంభావన నశించకుండా మోక్షం రాదు, ఇది ఇక్కడ గ్రహించవలసిన విషయం. మనకు మోక్షం కావాలి కాని మన ఉద్దేశ్యం ఎలా ఉంది అంటే మన అహంభావన నశించకూడదు, మన అజ్ఞానం నశించకూడదు, మన మనస్సు నశించకూడదు మోక్షం కావాలి అంటున్నాము. ఆచార్యుల వారు ఏమంటున్నారు అంటే నీ మనస్సు నశించకుండా, నీ అహంభావన నశించకుండా నువ్వు మోక్షసుఖాన్ని పొందలేవు అంటున్నారు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. అది నీకు తెలియకపోవచ్చు, తెలిసున్నా ఉంది, తెలియకపోయినా అది ఉంది. నీ హృదయంలో ఉన్న నిజం తెలుసుకోవడం కోసం ఎవరో నీకు అడ్డురావడం లేదు నీ అహంభావనే అడ్డు వస్తోంది, నీ దేహగతమైన నేనే అడ్డు వస్తోంది, నీ మనస్సే అడ్డు వస్తోంది. నువ్వు విద్య సంపాదించి ఆ మనస్సు నశించేలా చేసుకుంటే లోపల ఉన్న వస్తువు నీకు నేనుగా వ్యక్తం అవుతుంది.

నీకు కనిపించి వెళ్ళిపోయే దేవుడు కావాలా? 24 గంటలు ఒక్క క్షణం కూడా నిన్ను విడిచిపెట్టకుండా ఉండే దేవుడు కావాలా? నీకు ఏ దేవుడు కావాలో ఒకసారి ఆలోచించుకోమంటున్నారు స్వాములవారు. ఏదైనా మీరు వరం అడిగితే ఇచ్చి వెళ్ళిపోయే దేవుడు కావాలా? 24 గంటలు కూడా మిమ్మల్ని ఒక్క క్షణం కూడా విడిచిపెట్టకుండా ఉండే దేవుడు కావాలా? ఏ దేవుడు కావాలో మీరు ఆలోచించుకోండి. మీ హృదయంలోని దేవుడు ఒక్క క్షణం కూడా మిమ్మల్ని విడిచిపెట్టి ఉండడు. భక్తి కూడా పులి లాంటిది, సింహం లాంటిది. సింహం దగ్గరకి, పులులు దగ్గరకి అడవి జంతువులు రావు. అదేవిధంగా నీకు నిజంగా భక్తి ఉంటే ఈ రాగద్వేషాలు, ఈ కామక్రోధాలు నీ దగ్గరకి రావు, ఎటువంటి గుణాలు రావు. భక్తి ఉన్నచోట రాగద్వేషాలు కానీ, ups, downs దగ్గరకి రానే రావు. ఎవరికైతే భక్తి ఉందో వాళ్లకి మనసులోని వంకరలు వాటంతటఅవే పోతాయి. భక్తి అంటే సామాన్యం అనుకోకండి, ఎంతో కష్టపడితే భక్తి కలుగుతుంది. ఈ ప్రపంచంలో అన్నిటికంటే దుర్లభమైన వస్తువు ఏది అని ఆచార్యుల వారిని అడిగితే భక్తి సంపాదించడమే దుర్లభం అన్నారు. భక్తి అంటే ఊరికే మీరు ఏదో దేవుని పటాన్ని ఎదురుగా పెట్టుకుని పూజిస్తేనే భక్తి కాదు. నీ స్వరూపాన్ని నిరంతరం అనుసంధానం చేసుకుంటే అది భక్తి అన్నారు స్వాములవారు. ఊరికే దేవుడి పటం దగ్గర పూజ చేసుకుంటే అది L.K.G. లాంటిది. దేవుడి పటం ఎందుకు అంటే మనకి ఏదో ఒకటి support ఉండాలి కాబట్టి, ఏదో ఒక ఆలంబన ఉండాలి కాబట్టి, మన మనస్సుకి ఏదో ఒక సపోర్ట్ లేకపోతే చెయ్యలేదు కాబట్టి ఒక పటం పెట్టుకుని పూజిస్తాం. కానీ భక్తి అనేదానికి నిర్వచనం శంకరాచార్యుల వారు ఏమని చెప్పారు అంటే, నిరంతరం నీ స్వరూపాన్ని అనుసంధానం చేస్తే అది భక్తి అన్నారు. ప్రపంచంలో డబ్బు సంపాదించటం కష్టమే, విద్య సంపాదించటం కష్టమే, అధికారం సంపాదించటం కష్టమే,



**ఇతరులకు ఏదైనా చెప్పేటప్పుడు విమర్శగా కాకుండా సలహాగా చెప్పాలి. అలా చెప్పినప్పుడు అది మనకు, వారికి కూడా ఉపయోగపడుతుంది.**

అన్నిటికంటే హరిభక్తిని సంపాదించడం చాలా కష్టం అని చెప్పారు ఆచార్యస్వాములవారు.

ఒక సందర్భంలో భగవాన్ అన్నారు నువ్వు ఏదైనా చదువుకోవాలి అంటే, లెక్కలు నేర్చుకోవాలి అంటే, సంగీతం నేర్చుకోవాలి అంటే నువ్వు ఉండాలి, తెలివి ఉండాలి, తెలియబడేది ఒకటి ఉండాలి అంటే మూడు ఉండాలి అన్నారు. నేర్చుకునే నేను ఉండాలి, తెలివి ఉండాలి, తెలియబడే సబ్జెక్టు ఒకటి ఉండాలి అంటే మూడు ఉండాలి. నేను తెలుసుకోవడానికి మూడు అక్కర్లేదు నువ్వు ఒక్కడివి ఉంటే సరిపోతుంది అంటున్నారు. మామూలుగా బాహ్యమైన విద్యలు నేర్చుకోవాలి అంటే మూడు ఉండాలి. నువ్వు ఉండాలి, తెలివి ఉండాలి, తెలియబడే సబ్జెక్టు ఉండాలి, కానీ ఈ బ్రహ్మమును తెలుసుకోవడానికి మూడు అక్కర్లేదు. నువ్వు ఉన్నావు కదా, ఆ నేను ఉంది కదా, ఆ నేనుని నేను తోటి విచారణ చేసి పోగొట్టుకుంటే ఉన్న వస్తువు తానుగా వ్యక్తం అవుతుంది అంటున్నారు. మూడు అక్కర్లేదు నువ్వు ఉంటే చాలు అంటున్నారు. సత్వగుణం కూడా final truth కాదు, కానీ కాస్త దారి చూపిస్తుంది. అందుచేత భౌతికంగా కానీ, ఆధ్యాత్మికంగా కానీ అభివృద్ధిలోకి వెళ్ళాలి అంటే ముందు సత్వగుణాన్ని cultivate చెయ్యాలి. ఈ తమోగుణం, రజోగుణం మనకి దారిని చూపించవు. అంటే మనం పాడయ్యి పోవడానికి, మనం కానీ మన దేశం కానీ అభివృద్ధిలోకి రాకపోవడానికి కారణం రజోగుణం, తమోగుణం. అంటే మనకు సోమరితనం ఎక్కువ అయిపోతోంది.

స్వామివివేకానంద అనేవారు మనుషులు అందరికీ ఉన్నది తమోగుణమే. కానీ ఎవడింటి దగ్గర వాడు కూర్చుని మేము సత్వగుణంలో ఉన్నాం, జ్ఞానానికి జానెడు దూరంలో ఉన్నాం అనుకుంటున్నారు. ఉన్నది తమోగుణంలో కాని వాళ్ళలో వాళ్ళు మేము సత్వగుణంలో ఉన్నాం అని అనుకొంటున్నారు. అది నిజం కాదు అన్నారు. ఉన్నది ఒకటి, అనుకునేది ఒకటి అన్నారు. దీనికి, దానికి చాలా తేడా ఉంది. అందుచేత సత్వగుణాన్ని మనం cultivate కనుక చేస్తే మనం బాగుపడతాం, దేశం బాగుపడుతుంది, నువ్వు వికాసం పొందుతావు, చైతన్యస్థాయి పెరుగుతుంది. అందుచేత నువ్వు సత్వగుణాన్ని ముందు అభివృద్ధి చేసుకో అన్నారు. మనిషి బ్రతికేది ఆనందం కోసం, కొంతమంది అంటూ

ఉంటారు ఎన్ని ఉన్నా మాకు ఆనందం లేదండి ఇంక ఈ బ్రతుకు ఎందుకు అంటారు. కొంతమందికి అన్నీ ఉంటాయి కానీ ఆనందం ఉండదు. ఆనందం ప్రతీ మనిషికి కావాలి ఎందుకంటే వాడి స్వరూపంలో ఉన్నది ఆనందమే కాబట్టి. మనం ఎవరూ కూడా దుఃఖాన్ని కోరుకోము, విషాదాన్ని కోరుకోము. రెండు రోజులు దుఃఖంగా ఉంటే బాగుండును అని ఎవరూ కోరుకోరు. ఎప్పుడూ ఆనందాన్నే కోరుకుంటారు, ఎప్పుడూ శాంతినే కోరుకుంటారు, ఎప్పుడూ సుఖంగా ఉండాలని కోరుకుంటారు. ఎందుచేత అంటే నీ స్వరూపం ఆనందం, నీ స్వరూపం సుఖం, నీ స్వరూపం శాంతి కాబట్టి నీకు తెలియకుండా నీ కోసం వెతుక్కుంటున్నావు, నీకోసం నువ్వు అన్వేషిస్తున్నావు. అంటే మనిషి సుఖం కోసం వెతుకుతున్నాడు అంటే వాడికి తెలియకుండా వాడు ఎవడో తెలుసుకోవడం కోసం ప్రయత్నం చేస్తున్నాడు.

అహంకారం అనే పాము మూడు పడగల తోటి వాడి మీద ఆడుతోంది. ఆనందరత్నం, జ్ఞానరత్నం, శాంతిరత్నం, ఆత్మముత్యం నీ హృదయంలోనే ఉంది. వైరాగ్యం అనే ఖడ్గం తోటి, వివేకం అనే ఖడ్గం తోటి ఎవడైతే ఈ మూడు పడగలు ఉన్న పాముని కట్ చేస్తున్నాడో, ఎవడైతే దానిని చంపగలుగుతున్నాడో వాడు మటుకే ఆత్మముత్యాన్ని పొందగలడు అన్నారు ఆచార్య స్వాములవారు. నువ్వు ఆ పాముని చంపగలగాలి. ఈ అహంభావన అనేది మూడు పడగల తోటి బుస కొడుతోంది. ఆ పాముని నువ్వు ఏజన్మలో చంపితే ఆ జన్మలోనే ఆత్మనీకు అనుభవంలోకి వస్తుంది అన్నారు. మనిషి పుట్టినవాడు చనిపోవడం ఎంతఖాయమో, చనిపోయిన వాడు తిరిగి పుట్టడం కూడా అంతే ఖాయం. అందులో ఏమీ సందేహించవలసిన పని లేదు. మనిషి పుడుతున్నాడు, పుట్టినవాడు చనిపోతున్నాడు, ఇవి రెండు మనకి కనిపిస్తున్నాయి. దేహాన్ని విడిచిపెట్టి జీవుడు ప్రయాణం చేస్తూ ఉంటే అది జ్ఞాని చూడగలడు, ఈశ్వరుడు చూడగలడు అని పరమాత్మ చెప్పాడు. మనకి ఎంతసేపు భౌతికనేత్రాలకి, చర్మనేత్రాలకి కనిపిస్తేనే నిజం, లేకపోతే నిజం కాదు అనుకుంటాం. మనది చర్మదృష్టి, మనకు ఆత్మదృష్టి లేదు. మనది దేహబుద్దే కానీ మనకు ఆత్మబుద్ధి లేదు. దేహబుద్ధి నశిస్తేనే కానీ ఆత్మబుద్ధి కలగదు. మనకి ఆత్మబుద్ధి కావాలని ఉంది కానీ

దేహబుద్ధి నశింపచేసుకోవడానికి సిద్ధంగా లేము. నేనేదో physical exercise చేస్తున్నాను అంటే సరిపోదు. వివేకాన్ని, వైరాగ్యాన్ని నువ్వు బాగా ఉపయోగించుకోవాలి. Develop your buddhi, develop your discrimination, develop your knowledge అని అంటున్నారు ఆచార్యులవారు. అంటే దేహపరమైన సాధన ఒక్కటే సరిపోదు. నీ బుద్ధిని కూడా ఉపయోగించుకోవాలి. భగవంతుడు నీకు కాళ్ళు, చేతులు ఇచ్చినట్టు తెలివిని కూడా ఇచ్చాడు. భగవదనుభవం పొందడం కోసం ఆ తెలివిని కూడా ఉపయోగించుకోమంటున్నారు.

ఆత్మ అంటే ఎవరు? ఆత్మని కృష్ణుడు కూడా వర్ణిస్తాడు, ఆత్మకి పుట్టుక లేదు, ఆత్మకి చావు లేదు, కట్టెలు దానిని కాల్చలేవు, నీరు దానిని తడపలేదు, పంచభూతాలు లయించినా అది లయించదు. మీరు, నేను లయించడమే కాదు, మహా సామ్రాజ్యాలు లయించడమే కాదు, మహా సముద్రాలు ఎండిపోవడమే కాదు, ఏ పంచభూతాల వల్ల మన శరీరం తయారు అయ్యిందో, ఏ పంచభూతాల వల్ల మనం జీవిస్తున్నామో ఆ పంచభూతాలు నశించినా ఆత్మనశించదు అన్నారు ఆచార్యస్వాములవారు. నీ దేహం నశించినా, పంచభూతాలు కూడా నశించినా, అంటే మొత్తం సృష్టి అంతా నశించినప్పటికీ ఆ సత్య పదార్థం మటుకు నశించదు అన్నారు. ఇంతకీ ఏమి చెబుతున్నారు అంటే ఆత్మఎక్కడో ఉంది అనుకుంటున్నావేమో, అది నీ హృదయంలోనే ఉంది. అది వేరు, నువ్వు వేరు అనుకుంటున్నావు ఏమో, అది నీవే అయ్యి ఉన్నావు అన్న సంగతి నీకు తెలియడం లేదు. ఎవరో greatman interference వల్ల, ఒకమహర్షి యొక్క interference వల్ల, ఒక మహాయోగి యొక్క interference వల్ల, ఆ వస్తువుని తెలుసుకోవాలి అనే కాంక్ష నీకు arrise అవుతుంది కానీ లేకపోతే arrise కాదు అన్నారు. అసలు విద్యకి ముందు ఏది ముఖ్యం అంటే తెలుసుకోవాలి అనే కాంక్ష రావాలి. మనం భౌతికవిద్యని నేర్చుకోవాలన్నా, ఆత్మవిద్యని నేర్చుకోవాలన్నా ముందు తెలుసుకోవాలి అనే కాంక్ష కలగాలి. తెలుసుకోవాలి అనే కాంక్ష వస్తే ఎంతో కొంత మనం సాధించగలం. అది ఎలా వస్తుంది అంటే సత్పురుషుల సహవాసం వలన వస్తుంది. అందుచేత దుష్టసహవాసం చెయ్యవద్దు అంటున్నారు. సత్పురుషుల సహవాసం చెయ్యమంటున్నారు.

ఆచార్యులవారు సత్పురుషుల సాంగత్యానికి, సాధు సాంగత్యానికి చాలా ప్రాముఖ్యత ఇచ్చారు. ప్రతీ మానవుడికి వాడి ప్రాణం అంటే వాడికి ఇష్టం. నా ప్రాణం అంటే నాకు బాగా ఇష్టం, మీ ప్రాణం అంటే మీకు బాగా ఇష్టం. ఈ ప్రాణం పోతుంది అంటే ఎన్ని లక్షల రూపాయలు అయినా బర్న్ చేసేస్తాం. వైద్యం చేయించుకోడానికి అవసరమైతే అమెరికా వెళ్ళిపోతాం. లేటెస్ట్ మెడిసిన్ ఇంకా ఎక్కడో ఉంది అంటే, లేటెస్ట్ సర్జరీ ఎక్కడో ఉంది అంటే అక్కడికి వెళ్ళిపోతాం, ఇది అంతా చేసేది ప్రాణం రక్షించుకోవడం కోసం. ఎవడికి వాడికి ఆ ప్రాణం అంటే బాగా ఇష్టం. ఆచార్యుల వారు ఏమని చెబుతున్నారు అంటే నీ ప్రాణాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నావో, నీ ప్రాణం కంటే ఎక్కువగా, నీ ప్రాణం కంటే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చి సజ్జనసాంగత్యం కాపాడుకో అంటున్నారు ఆచార్యులవారు. నీ ప్రాణాన్ని ఎంత జాగ్రత్తగా నువ్వు కాపాడుకుంటున్నావో అంత జాగ్రత్తగా సజ్జన సాంగత్యాన్ని కాపాడుకో, సాధు సాంగత్యాన్ని కాపాడుకో, అప్పుడు నీకు జ్ఞానం సంపాదించాలి అనే కోరిక arrise అవుతుంది అంటున్నారు. దుష్ట సాంగత్యం వల్ల, మూర్ఖత్వం వల్ల అది రాదు. ప్రతీ మానవుడికి వాడి మూర్ఖత్వం వల్ల వాడికి జ్ఞానం రావడం లేదు, దానికి ఇతరులు ఎవరు కారణం కాదు. జ్ఞానం రాకుండా వాడి మూర్ఖత్వమే వాడికి అడ్డు వస్తోంది, ఇతరులు ఎవరో అడ్డు వస్తున్నారు అనుకోవడం అజ్ఞానం, అది అవివేకం, అది అహంభావన యొక్క లక్షణం. అందుచేత నువ్వు ఏ పని చేసినా అందులో ప్రేమ ఉండాలి, ఏకాగ్రత ఉండాలి, దయ ఉండాలి అంటున్నారు. దానివల్ల భగవంతుడికి ప్రీతి కలుగుతుంది ఎప్పుడైతే భగవంతుడికి ప్రీతి కలిగిందో, ఆయన నీ హృదయంలోనే ఉన్నాడు కాబట్టి వెంటనే immediate గా ఆయన నీకు వ్యక్తం అవుతాడు. ఎవరినైతే పొందాలి అని మనం అనుకుంటున్నామో ఆయన అనుగ్రహం మన మీద లేకుండా మనం ఆయనని పొందలేము.

భగవాన్ దగ్గరకి ఒక భక్తుడు వచ్చాడు, వాడు నిరాడంబరుడు, వాడికేమి ఆడంబరం లేదు, నన్ను భక్తుడు అని అందరూ చెప్పుకోవాలి అని ఆడంబరం లేదు. కొంతమంది భక్తులు మేము భక్తి పరులం అని అందరూ చెప్పుకోవాలి అని అనుకుంటారు. దానివల్ల మళ్ళీ అహంభావన పెరుగుతూ ఉంటుంది. అందుచేత ఏమని చెబుతున్నారు అంటే

ఎవడైతే ఆడంబరం లేకుండా జీవిస్తున్నాడో వాడికి తెలిసున్నా, వాడికి తెలియకపోయినా అహంభావన ఆరోజుకారోజు వాడికి reduce అవుతూ ఉంటుంది. నువ్వు తల్లి కడుపు లోంచి బయటకి వచ్చావు, బయటకి వచ్చి స్మశానానికి వెళ్ళే లోపులో ఈ ఒక్కజన్మలోనే నీకున్న అజ్ఞానం మొత్తం పోకపోయినప్పటికి, స్మశానానికి వెళ్ళే లోపులో అజ్ఞానాన్ని కొంచెం స్లో గా reduce చేసుకుంటూ రా అన్నారు. అంటే కొంచెం కొంచెం అయినా తగ్గించుకుంటూ రా, ఒకే జన్మలో నీకు ఉన్న అజ్ఞానం అంతా నశించక పోవచ్చు, కానీ కొంచెం, కొంచెం నువ్వు దానిని తగ్గించుకోవడానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు ఈజన్మలో చేసిన కృషి అంతా కూడా రాబోయేజన్మలో నీకు కలిసివస్తుంది. ఇప్పుడు నువ్వు మంచి చేస్తే ఊరికే పోదు, సాధన చేస్తే ఊరికే పోదు, నువ్వు ఎంత సాధన చేస్తే అంత, ఎంత మంచి చేస్తే అంత, ఎంత సత్కర్మ చేస్తే అంత, రాబోయేజన్మలో నీకు కలిసి వస్తుంది కానీ నువ్వు చేసిన మంచి పని భగవంతుడికి ఏమీ అక్కర్లేదు. నీది నీకే ఇచ్చేస్తాడు అంటున్నారు. ఆడంబరం లేకుండా జీవించటం కనుక మనం నేర్చుకుంటే దానంతట అదే అజ్ఞానం తగ్గిపోతుంది. అంటే మనం ఆడంబరం లేకుండా జీవించాలి. మనం ఏదైనా ఒక పని చేస్తే ఆ పని నిర్మలంగా చెయ్యాలి, నిరాడంబరంగా చెయ్యాలి, నిష్కామంగా చెయ్యాలి. అదీ ఇక్కడ చెప్పేది. నిష్కామంగా కనుక నువ్వు చేస్తే ఫలితం వస్తే రావచ్చు, లేకపోతే రాకపోవచ్చు, మన కోరిక లేకపోయినా ఫలితం వస్తుంది. కోరికకిశక్తి లేదు,శక్తి ఈశ్వరుడిది అన్నారు రమణాచార్యుడు. నీకు కోరిక ఉన్నంతమాత్రం చేత ఆ కోరిక నెరవేరదు. నీ కోరిక నెరవేరే ప్లాన్ ఈశ్వరుడికి ఉంటే అది నెరవేరుతుంది.

రమణాశ్రమంలో మాతృభూతేశ్వర ఆలయం కట్టేటప్పుడు ఆశ్రమఅధికారికి, అక్కడ పనిచేసే తాపీమేస్త్రీకి ఏదో పేచీ వచ్చింది. ఆ తాపీమేస్త్రీ ఇలా కట్టాలి అంటున్నాడు, ఆశ్రమ అధికారి అలా కట్టాలి అంటున్నాడు. రమణమహర్షి గారితోటి తాపీమేస్త్రీ ఏమని చెప్పాడు అంటే ఇంజనీరు గారు ఇలా కట్టమంటున్నారు , నా ప్లాన్ ఇలా ఉంది, ఇంజనీరు గారి ప్లాన్ అలా ఉంది మా ఇద్దరికీ పడటం లేదు అని రమణమహర్షి గారి దగ్గరకి వెళ్లి చెప్పాడు. రమణమహర్షి గారు ఏమన్నారు అంటే నీ ప్లాన్ జరగదు, ఇంజనీరు గారి ప్లాన్ జరగదు,

దేవుడు ఒకడు ఉన్నాడు కదా వాడి ప్లాన్ జరుగుతుంది నువ్వు వెళ్లిరా అన్నారు. ఆయన ప్లాన్ ప్రకారమే సృష్టి నడుస్తుంది. నువ్వు వేసుకోవచ్చు ప్లానులు, అలాగే ఇంజనీరు గారు కూడా ప్లానులు వేసుకోవచ్చు, నువ్వు ఏవిధంగా ప్లానులు వేస్తున్నావో, ఆ ఇంజనీరు గారు ఏవిధంగా ప్లానులు వేస్తున్నారో అలా దేవుడు కూడా ప్లాన్ వేస్తూ ఉంటాడు. చివరికి జరిగేది దేవుడి ప్లాన్ జరుగుతుంది. నీ ప్లాన్, దేవుడి ప్లాన్ ఒకటే అయినప్పుడు నేను అనుకున్న ప్లాన్ జరిగిపోయింది, నేను అనుకున్న పని success అయ్యింది అని నువ్వు అనుకుంటావు. అప్పుడు నీ అహంభావం ఉబ్బుతుంది కానీ ఇందులో అంతకంటే ఏమీ లేదు అన్నారు. జరిగేది అంతా దేవుడి ప్లాన్ ప్రకారం జరుగుతుంది. ఎలక్షన్ లో నెగ్గినవాడు ఏమనుకుంటాడు అంటే నేను గొప్పవాడిని అనుకుంటాడు, ఓడిపోయినవాడు బాధపడుతూ ఉంటాడు. వాడు నెగ్గడం వాడి తెలివితేటల వల్ల నెగ్గడం కాదు దేవుడి ప్లాను ప్రకారం వాడు నెగ్గవలసి ఉంది కాబట్టి నెగ్గాడు. ఆ సంగతి వాడికి తెలియకపోవచ్చు, ఏదైనా అంతే, దేవుడి ప్లానులో ఉండాలి, దేవుడి ప్లానులో ఉంటే అది జరుగుతుంది. దేవుడి ప్లానులో లేకపోతే అది జరగదు. కానీ నువ్వు అలా అనుకోవడం లేదు, నా తెలివితేటల వల్ల నేను అది సాధించాను అనుకొంటావు, నీ అహంభావన అలా అనిపింపచేస్తుంది. జరిగేది అంతా ఈశ్వరసంకల్పం. ఇది తెలుసుకున్నవాడికి దుఃఖం నశిస్తుంది అన్నారు. రమణమహర్షి గారు ఒక్క వాక్యంలో సృష్టి రహస్యం చెప్పారు. జరిగేది అంతా ఈశ్వరసంకల్పమే. నీ పెళ్లే కాదు, బర్త్ కాదు, డెత్ కాదు, నీ శరీరం చనిపోయిన తరువాత రాబోయేజన్మలో ఎక్కడ జన్మించాలి, ఎప్పుడు జన్మించాలి, ఏ కుటుంబంలో జన్మించాలి అది కూడా ఈశ్వరప్రణాళిక ప్రకారం జరుగుతుంది. జరిగేది అంతా ఈశ్వరసంకల్పం ప్రకారమే జరుగుతుంది, అది నువ్వు తెలుసుకోవాలి, అది తెలుసుకుంటే సుఖపడతావు, తెలియకపోతే

**ఏదైనా మంచి చేసినా మరిచిపోవాలి. దానిని మోయకూడదు. దానిని మోస్తూ ఉంటే పునర్జన్మ హేతువులు ఏర్పడతాయి.**



దుఃఖం నిన్ను ప్రతీజన్మకి వెంటాడుతూనే ఉంటుంది. నీకు ఎంత ధనం ఉన్నా, ఎంత అధికారం ఉన్నా నువ్వు సుఖపడవు. ఉంటే ఉండవచ్చు అంతమాత్రం చేత నీకు సుఖం రాదు. కర్తృత్వం లేకుండా ఎవడైతే జీవిస్తున్నాడో, వాడినే సుఖం వరిస్తుంది, వాడినే శాంతి వరిస్తుంది, వాడికే యోగ్యత వస్తుంది, మోక్షసామ్రాజ్యానికి వాడు మాత్రమే అర్హుడు అవుతాడు.

నిరాడంబరుడు అయిన భక్తుడు ఒకడు భగవాన్ దగ్గరకు వచ్చాడు, ఆ భక్తుడి యొక్క బిడ్డ, ఒకే ఒక అబ్బాయి మూడు సంవత్సరాల వాడు చనిపోయాడు. భక్తుల తోటి భగవాన్ చెబుతున్నారు మనం అభ్యాసం కనుక చేస్తూ ఉంటే, మనకి భక్తి కనుక కుదిరితే, వైరాగ్యం కనుక ఉంటే మనకి ఎంత నష్టం వచ్చినప్పటికీ, ఎంత కష్టం వచ్చినప్పటికీ, ఎంత disappointment వచ్చినప్పటికీ అభ్యాసం కనుక ఉంటే అన్నీ దుఃఖాలకి, ఆప్తజన నష్టానికి, మన ఆప్తులు ఎవరికైనా మరణం వచ్చినప్పటికీ, వాళ్ళతోటి మనకి వియోగం వచ్చినప్పటికీ భరించే ఓర్పుని, ధైర్యాన్ని భక్తి ఇస్తుంది. అందుచేత భక్తి అనేది ఎందుకు పనికిరాదు అనుకోవద్దు. భక్తిని సంపాదించుకుని ఉండండి, అవసరం అయినపుడు అది మీకు ఉపయోగపడుతుంది. మీకు కష్టం వచ్చినప్పుడు భక్తి కాస్తుంది, మీకు ఓర్పుని ఇస్తుంది, ధైర్యాన్ని ఇస్తుంది, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది, తెలివిని ఇస్తుంది, సత్వగుణాన్ని ఇస్తుంది అంటున్నారు స్వాములవారు.

ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే వస్తువుని మీరు కోరుకోవద్దు, మోక్షాన్ని కోరుకోండి. చాలా వస్తువులు ఇవాళ పచ్చగా ఉంటాయి, రేపటికి ఎండిపోతాయి. భగవంతుడిని ఏది అడగాలో, ఏది అడగకూడదో అసలు మనకే తెలియదు. అందుచేత ఈశ్వరుడితో నీ సంకల్పమే నా సంకల్పం, నీ ఇష్టమే నా ఇష్టం అని చెప్పేస్తే సరిపోతుంది. నీ సంకల్పమే నా సంకల్పం, నీ ఇష్టమే నా ఇష్టం ఎలా చేసినా సరే, నువ్వు నీటిలో ముంచినా, పాలలో ముంచినా అది నీ ఇష్టమే, ఏది చేసినా సరే అది నీ ఇష్టమే, నువ్వు ఏది చేస్తే అది అని భగవంతుడితో అంటే అప్పుడు మన బాధ్యత ఆయన తీసుకుంటాడు. అలా కాకుండా మనం స్వతంత్రంగా నాకు ఇది కావాలి, అది కావాలి అంటే అడిగింది ఇచ్చి ఊరుకుంటాడు, మిగతా గొడవ వదిలేస్తాడు. రమణమహర్షి గారు అనేవారు దేవుడు అడిగిన భక్తుడికి

అడిగినదే ఇస్తాడు, అడగని వాడికి అన్నీ ఇస్తాడు అన్నారు. ఆ వైభవం ఉన్నప్పుడు కొంతమందికి అసలు అడగాలి అనేబుద్ధి కలగదు. భక్తి భరించే ధైర్యాన్ని ఇస్తుంది. నీకు ఏదైనా కష్టం వచ్చినప్పటికీ నీకు భక్తి ఉంటే నీ కష్టం అంతా సుఖంగా మార్చేసేశక్తి భక్తికి ఉంది. నీకు బండెడు దుఃఖం ఉంది అనుకోండి, బండెడు దుఃఖాన్ని బండెడు సుఖంగా మార్చేస్తుంది. అటువంటిశక్తి భక్తికి ఉంది, అది ఓర్పుని నేర్పుతుంది. భక్తి అనేక కళ్యాణగుణాలని తెచ్చి పెడుతుంది, నీకు అన్నీ నేర్పుతుంది. ఇంతకీ భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే మీ ఇంట్లో ఎవరైనా మరణిస్తే, ఆ మరణించిన వాళ్ళు అందరూ సుఖంగా ఉన్నారు, సంతోషంగా ఉన్నారు, వాళ్ళ గురించి మీరు దుఃఖపడకండి. ఒకవేళ మీకు దుఃఖపడాలి అని ఉంటే మీలో ఉండి ఆ మరణించిన వాడి గురించి ఎవడైతే దుఃఖ పడుతున్నాడో వాడికి ఇంకా మరణం రాలేదని దుఃఖపడండి అన్నారు.

కుటుంబాల్లో కానీ, గ్రామాల్లో కానీ, దేశంలో కానీ శత్రుత్వాలకు, వైరాలకు చాలా మటుకు, నూటికి తొంభై పేచీలకు కారణం అనాలసిస్ చేసుకుని చూస్తే, చివరకి అహంభావనే కారణం అవుతుంది. కొంతమంది దారిద్ర్యం తోటి బాధపడతారు. దారిద్ర్యానికి చాలా విషయాలలో అహంభావనే కారణం. పేచీలకి ఎక్కువ అహంభావనే కారణం, ఈ దుఃఖం ఎందుకు వచ్చింది, ఈ పేచీ ఎందుకు వస్తుంది అని విడదీసుకుని చూస్తే, దాని bottom లోకి వెళితే, అహంభావనే కారణం అని మన intelligenceకే తెలుస్తుంది. నీ ఆప్తులు, నీకు అత్యంత సన్నిహితులు, నీ nearest, dearest వాళ్ళు శరీరం విడిచిపెట్టినప్పుడు ఎంతో కొంత దుఃఖం ఉంటుంది. ఆ దుఃఖం ఎందుకు ఉంటుందో భగవాన్ చెబుతున్నారు. తనకంటూ సృష్టిలో ఒక రూపం ఉంటుంది. ఈ రూపాన్ని నేను అనుకుంటున్నావు. ఈ రూపం నేను అనుకుంటున్నావు కాబట్టి ఆ రూపంతో నీకు ఏదో బంధుత్వం ఉంటుంది, కొడుకు అనో, కూతురు అనో, అల్లుడు అనో, ఇంకొకటి అనో ఏదో బంధుత్వం ఉంటుంది. ఈ రూపం నువ్వు కాకపోయినా అదే నువ్వు అనుకుంటున్నావు. ఈ రూపంతోటి నీకు అనుబంధం ఉన్నంతకాలం ఇతర రూపాలు నీకు బంధువులు అనిపిస్తూ ఉంటుంది. ఈ దుఃఖానికి కారణం నువ్వు చూసుకుంటే చివరకు నీ దేహబుద్ధే కారణం అవుతుంది. నువ్వు

ఏదో ఒక రూపం తోటి ఐడెంటిఫై అవుతున్నావు. ఈ దేహం తోటి ఐడెంటిఫై అవుతున్నావు. అందుచేత ఇంకొక దేహం కోసం ఈ దేహం దుఃఖపడుతూ ఉంటుంది. చనిపోయిన వాడి గురించి చావడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళు ఏడుస్తూ ఉంటారు. అంటే ఆ దేహం ముందు వెళ్ళిపోయింది, ఈ దేహం కొంచెం ఆలస్యం అవుతుంది.

ఆత్మవిద్య లేనివాడు, ఆత్మజ్ఞానం లేనివాడు పశువు తోటి సమానం అని ఆచార్యుల వారు చెప్పారు. అంటే జీవలక్షణాలు ఉన్నవాడు ప్రతీవాడు కూడా పశువే. శివుడికి పశుపతి అని ఒక పేరు ఉంది. మనం అందరం పశువులం, మనకి ఒక పతి ఉన్నాడు, వాడు ఈశ్వరుడు. ఈశ్వరశబ్దం శివుడికి వర్తిస్తుంది, విష్ణువుకి వర్తిస్తుంది, ఈశ్వరుడు అంటే నియమించేవాడు అని అర్థం. అంటే జీవుడు వాడు చేసుకున్న కర్మని బట్టి వాడి ప్రారబ్ధాన్ని బట్టి ఆ జీవుడిని ఎక్కడ ఎలా నియమించాలో అలా నియమిస్తూ ఉంటాడు వాడే ఈశ్వరుడు. ఆయనే పశుపతి. ఆ పశుపతిని కనుక మనం ఆశ్రయిస్తే పశులక్షణాలు పోగొడతాడు. పశుపతిని ఎవడైతే నిరంతరం ధ్యానం చేస్తూ ఉంటాడో, నిరంతరం వాడిని స్మరించుకుంటూ ఉంటాడో, వాడికి పశులక్షణాలు నశిస్తాయి. స్మరణ అనేది remembrance అనే దానిని తక్కువస్థాయిలో ఉంచకండి, remembrance కూడా సాధనలో చాలా ముఖ్యమైన భాగం. Remembrance వల్ల ఈశ్వరుడి తోటి మనకి మానసికమైన అనుబంధం వస్తుంది. ఊరికే భగవంతుడిని స్మరిస్తే సరిపోతుందా? అది చిన్న విషయం కదా అనుకోకండి, భగవంతుడిని స్మరించుకోవడం కూడా గొప్ప విషయమే. ఆయన నామాన్ని స్మరించుకోవడం వలన ఆయన తోటి మనకి మానసికఅనుబంధం ఏర్పడుతుంది. ఆ mental కాంటాక్ట్ మనకి మోక్షాన్ని తెచ్చిపెడుతుంది.

**అరుణాచల మనుచు స్మరియించు వారల అహము నిర్మూలింతువరుణాచలా**

దేవుడిని స్మరించడం వల్లే మోక్షం వచ్చేస్తుందా అని ఒక అడ్వకేట్ గారు అడిగారు. అది దేవుడు చెబుతున్నాడు, అది సుప్రీంకోర్టు judgement, సవాలు చెయ్యడానికి నువ్వు ఎవరవు అన్నారు రమణమహర్షి గారు. నీకు రూపచింతన ఉన్నంతసేపు, ఒక రూపం తోటి ఐడెంటిఫై అవుతున్నంతకాలం ఏదో ఒక అవతారపురుషుడిని ఆరాధించడం వలన శవబుద్ధి తగ్గుతుంది,

నీకు శివబుద్ధి కలుగుతుంది అంటున్నారు స్వాములవారు. ఏ god అయితే ఏముంది అన్నీ ఒక్కటే. వస్తువు ఒక్కటే కానీ రూపాలు తేడా, నామాలు తేడా, నువ్వు ఏ దేవుడిని ఆరాధించినప్పటికీ నీకు నిజం తెలియకపోయినా నువ్వు ఆరాధించే దేవుడికి నిజం తెలుసు. అక్కడకి తీసుకుని వెళ్ళేవరకు ఆయన నిన్ను విడిచిపెట్టడు. నువ్వు బండి ఎక్కి కూర్చో సరిపోతుంది, తరువాత destinationకి తీసుకెళ్ళి అదే పడేస్తుంది. అహంభావన రూపాన్ని పట్టుకుని పుడుతుంది, రూపాన్ని పట్టుకుని పెరుగుతుంది, రూపాలను మారుస్తూ ఉంటుంది, అది చనిపోయినప్పుడు కూడా ఏదో ఒక రూపం కోసం ఏడుస్తూ చనిపోతుంది. రూపదృష్టి ఉన్నంతకాలం, నామదృష్టి ఉన్నంతకాలం, నువ్వు ఏదో ఒక అవతారపురుషుడిని ఆరాధించడం అవసరమే. నీకు రూపదృష్టి నశించింది అనుకో, నామదృష్టి నశించింది అనుకో, దేహబుద్ధి నశించింది అనుకో, అప్పుడు నువ్వు ఆత్మవి అన్న సంగతి నీకు తెలుస్తుంది, నీకు పుట్టుక లేదు, చావు లేదు అన్న సంగతి నీకే వ్యక్తం అవుతుంది.

భగవంతుడు నీ హృదయంలో ఉన్న మాట నిజమే, కానీ నీ అలవాట్ల యొక్క వేగం ఆ వస్తువుని నీకు తెలియనివ్వకుండా చేస్తుంది అన్నారు. అలవాట్ల యొక్క వేగం ఎలా ఉంటుందో మీకు ఒక ఉదాహరణ చెబుతాను. నేను రెండు రోజుల కిందట జిన్నూరు నుంచి నరసాపురం వచ్చాను. జిన్నూరు నుండి మందుల పెట్టి తెచ్చుకోవడం మర్చిపోయాను, సాయంత్రం 9.30 గంటలకి నిద్రపోయేటప్పుడు ఏవో రెండు టాబ్లెట్స్ వేసుకుంటాను, అది అలవాటు. ఆ టాబ్లెట్స్ పెట్టె ఇంటివద్ద నుంచి తీసుకుని రాలేదు, ఆ టాబ్లెట్స్ లేవు. సరే డాక్టరుగారి కాంపౌండర్ని పంపుదాం అంటే అప్పటికే రాత్రి 9.30 అయ్యిపోయింది. ఈ టైములో మనం కాంపౌండర్ని ఇబ్బంది ఏమి పెడతాం అని నిద్రపోయాను. నిద్రపోయినప్పుడు వెంటనే నిద్ర పట్టేసింది. రాత్రి నిద్రలో ఈ జీవుడు ఏమి చేశాడు అంటే మందుల కోసం టౌనులో పడ్డాడు. జీవుడికి మందులు వేసుకునే అలవాటు ఉంది కదా, శరీరం ఇక్కడే నిద్రపోతోంది. లోపల జీవుడు ఏమి చేశాడు అంటే టౌనులోకి వచ్చేశాడు. రాత్రి పదకొండు గంటలకి ఏదో కొట్టులోకి వెళ్ళి మందులు కొనేసుకున్నాడు. మీకు అర్థం అవుతోందా? టాబ్లెట్స్ కొనుక్కున్నాడు, తెచ్చేసుకున్నాడు, మింగడం లేదు. ఎందుకు

మింగడం లేదంటే భోజనం చేసిన తరువాత వేసుకోవడం అలవాటు వాడికి. నా మనస్సు రెండు ముక్కలు అయ్యిపోయింది. ఒక ముక్క ఏమంటోంది అంటే మందులు తెచ్చేసుకున్నావు కదా, మందులు మింగు అంటోంది. మందులు మింగడానికి టైము దాటిపోయింది కదా ఈ టైములో మందులు ఎలా మింగుతాను అని రెండోది అంటోంది. అది చెప్పేదీ మైండే, ఇది చెప్పేదీ మైండే. మొత్తం మీద ఇద్దరూ ఘర్షణ పడడం ప్రారంభించారు. నాకు మెలకువ వచ్చేసరికి తెల్లవారుజామున మూడు అయ్యింది. ఇది అలవాట్ల యొక్క వేగం. అంటే మరణించిన తరువాత కూడా జీవుడు ఎలా పనిచేస్తాడు అంటే వాడి సంస్కారాన్ని బట్టి, వాడి అలవాట్లని బట్టి పనిచేస్తాడు. శరీరానికి ఏమీ సంబంధం లేదు.

రమణమహర్షి గారు ఒక సూత్రం చెప్పారు. ఈ చిన్న విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి, మీరు సూక్ష్మబుద్ధి తోటి ఆలోచించండి, మనిషికి బుద్ధి ప్రధానం. అందుచేత ఆచార్యులవారు కూడా develop your buddhi, develop your intelligence అని చెబుతూ ఉంటారు. ఈ ఒక్క సూత్రం మీరు జ్ఞాపకం ఉంచుకోండి, భగవాన్ ఈ సూత్రం చెప్పారు. ఎవరి శరీరం అంటే వాడికి ఇష్టం. ఎవడి మనసు అంటే వాడికి ఇష్టం, ఎవడి అజ్ఞానం అంటే వాడికి ఇష్టం, గాఢనిద్రలో నీ శరీరం గొడవ నీకు లేదు. మనస్సు గొడవ నీకు లేదు, నీకు ఏదైతే ఇష్టమో ఆ ఇష్టంకు సంబంధించిన గొడవ ఏదీ నీ గాఢనిద్రలో లేదు. కానీ మీరు అక్కడ సుఖంగా ఉంటున్నారా? లేదా? శాంతిగా ఉంటున్నారా? లేదా? ఈ ఒక్కటి అర్థం చేసుకోండి. మీకు ఇంక ఏమీ అక్కర్లేదు అన్నారు. మీకు అందరికంటే మీ దేహం మీకు ఇష్టం, గాఢనిద్రలో మీకు దేహం గొడవ ఉందా? దేహం గొడవ లేదు. పోనీ దేహం గొడవ లేని మూలాన అక్కడ దుఃఖంగా ఉన్నారా? సుఖంగా ఉన్నారా? సుఖంగానే ఉన్నారు. మరి దేహానికి చావు అంటే మీకు ఎందుకు భయం వేస్తుంది? ఇది బాగా అర్థం చేసుకోండి. కొన్ని కొన్ని విషయాలు అర్థం చేసుకోవడానికి జీనియస్ అక్కర్లేదు, Commonsense ఉంటే సరిపోతుంది, Commonsense చాలా ముఖ్యం. ఇదే భగవాన్ చెప్పేది, మీకు ఎవరి దేహం అంటే వారికి ఇష్టం. ఎవరి అజ్ఞానం అంటే వారికి ఇష్టం, మీ మనసులో కోరికలు మీకు ఇష్టం. గాఢనిద్రలో మీకు ఇష్టమైన వాటితో మీరు సెపరేట్ అవుతున్నారు. అక్కడ

మీ దేహం గొడవ లేదు, మీ మనసు గొడవ లేదు, అక్కడ మీరు శాంతిగా ఉన్నారా? అశాంతిగా ఉన్నారా? అక్కడ మీరు సుఖంగా ఉన్నారా?అసుఖంగా ఉన్నారా? అది మీరు ఆలోచించుకోండి చాలు. ఎప్పుడో చనిపోయిన తరువాత గొడవ ఎందుకు?మరణాంతర జీవితం అటు ఉంచండి. ఇప్పుడే, ఇక్కడే ఈ దేహం భూమి మీద ఉండగానే, మీరు గాఢనిద్రలో ఉన్నప్పుడు మీరు శాంతిగా ఉన్నారా? అశాంతిగా ఉన్నారా? మీరే ఆలోచించుకోండి. దీనికి ఋజువులు అక్కర్లేదు, శాస్త్రాలు అక్కర్లేదు, మీ అనుభవానికి మీకు తెలుస్తోందా? లేదా? ఎప్పుడైతే మీకు రూపబుద్ధి నశించిందో అప్పుడు బ్రాహ్మీస్థితి కలుగుతుంది. మీకు బ్రహ్మానుభవం కలుగుతుంది. బ్రహ్మంలో ఉన్నది ఆనందమే, అప్పుడు ఆనందం మీకు ఎలా వ్యక్తం అవుతుంది? వైకుంఠంలో ఆనందం ఉంది, కైలాసంలో ఆనందం ఉంది, అలా కాదు. వైకుంఠంలో ఏ దేవుడు అయితే ఉన్నాడు అని అనుకుంటున్నావో, కైలాసంలో ఏ దేవుడు అయితే ఉన్నాడు అనుకుంటున్నావో, ఆ దేవుడే నీకు నేనుగా వ్యక్తం అవుతాడు. అప్పుడు నువ్వు ఆనందసముద్రంలో, శాంతిసముద్రంలో ఊగిసలాడతావు. ఎప్పుడైతే నీకు బ్రహ్మానుభవం కలిగిందో లోపల ఉన్నటువంటి ఆనంద రసం, శాంతిరసం, నీ హృదయంలో ఉన్న ఆనంద సముద్రం పొంగి పొంగి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది. రమణమహర్షి గారు చెప్పే సాధనలు దేవుడు ఉన్నాడా? లేడా అన్న సమస్య కాదు. నువ్వు ఉన్నావా? లేదా? చూసుకుంటే చాలు అన్నారు.

ఈ నేను అనే తలంపు ఆత్మలోంచే పుట్టి వస్తుంది. ఈ నేను అనే తలంపు మొదలు తెలిస్తే నీకు ఆత్మతెలుస్తుంది. దానికి చావు లేదు, పుట్టుక లేదు అన్న సంగతి తెలియడమే కాదు అది నీవే అన్న సంగతి నీకు తెలుస్తుంది, అది ఇక్కడ రహస్యం. అదే కడసారి జన్మ. దానికి కృష్ణుడు ఏమని చెప్పాడు అంటే ఎన్నోజన్మల పుణ్యం ఉంటేనే కానీ అది నీకు రాదు



**భగవంతుడి యొక్క సంకల్పం మీద మనకు నిజంగా గౌరవం ఉంటే, మనలను అసలు దుఃఖం ముట్టుకోదు.**

అన్నాడు. నీకు రూపబుద్ధి ఉన్నంతకాలం ఆత్మబుద్ధి కలగదు. నీకు రూపబుద్ధి ఉన్నంతకాలం ఎంతోకొంత దుఃఖం తప్పదు. వారు చనిపోయారు అనో, వీరు చనిపోయారు అనో, వారికి కష్టం వచ్చింది అనో, వీరికి కష్టం వచ్చింది అనో, ఇటువంటి చిల్లర దుఃఖాలు తప్పవు నీకు రూపబుద్ధి ఉన్నంతకాలం. ఆ రూపబుద్ధి నశించిన వెంటనే నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. నువ్వు ఏదో ఒక దేహం తోటి తాదాత్మ్యం పొందుతున్నావు. ఆ దేహం తోటి తాదాత్మ్యం పొందడం వలన ఈ చిక్కులు అన్నీ వస్తున్నాయి. ఈ అరిష్టాలు అన్నీ వస్తున్నాయి, ఈ అశాంతి వస్తుంది, ఈ difficulties అన్నీ వస్తున్నాయి. ఈ శరీరం చనిపోతుంది, చనిపోయిన తరువాత ఎక్కడకి వెళతాం? రోజూ నిద్రలో ఎక్కడ ఉంటామో చనిపోయిన తరువాత అక్కడే ఉంటాం. ఎంతకాలం అలాగ ఉంటాం? నిద్రలో నాలుగు గంటలో, ఐదు గంటలో ఉంటాం చనిపోయిన తరువాత సంవత్సరాలు ఉంటాం. అప్పుడు మనకున్న పూర్వజన్మ సంస్కారాలు, కోరికలు అన్నీ కూడా మెదులుతాయి. ఆ జీవుడు శరీరం కోసం తిరుగుతూ ఉంటాడు. ఎందుకంటే వాడి గుణాలు వ్యక్త పరచుకోవడం కోసం వాడికి మేటర్ ఉండాలి, ప్రపంచంలో శరీరాలు తయారుఅవుతూ ఉంటాయి. ఆ ప్రారబ్ధాన్ని బట్టి ఈ జీవుడికి ఏ శరీరం అయితే బాగుంటుందో, ఆ శరీరానికి కనెక్షన్ ఇస్తాడు అంతే ఈశ్వరుడు చేసే పని.

కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడు అంటే నువ్వు సాధన కనుక సరిగ్గా చేస్తుంటే ఏ శరీరంలో నిన్ను ప్రవేశపెడితే నీకు సాధన బాగా సాగుతుందో, ఆ బాడీకి నేను కనెక్షన్ ఇస్తాను అంతే నేను చేసే పని. అదైనా నీ ప్రారబ్ధాన్ని బట్టి ఇస్తాను. ఒక జీవుడు మీద నాకు ఇష్టం లేదు, ఒక జీవుడు మీద అయిష్టం లేదు, నాకు అందరూ సమానమే, నువ్వు చేసిన కర్మని బట్టి, నీకున్న సంస్కారాన్ని బట్టి నీకు ఆ బాడీ తోటి కనెక్షన్ ఇస్తాను అంతే. భగవాన్ ఏమని చెబుతున్నారు అంటే ఈ అహంభావన ఎంతసేపు రూపం కోసం చూస్తూ ఉంటుంది. మళ్ళీ ఎప్పుడు పుడతామా, ఎప్పుడు సినిమాలు చూద్దామా, ఎప్పుడు పలావు తిందామా అని చూస్తూ ఉంటుంది. దానికి కోరికలు ఉంటాయి కదా, అది దేహం కోసం చూస్తూ ఉంటుంది. పోనీ వాడు కోరిక పడుతున్నాడు అని ఏదో ఒక దేహం ఇస్తాడు ఈశ్వరుడు. ఆ దేహం వచ్చాక ఆ దేహాన్ని పట్టుకుని మళ్ళీ అహంభావనని పెంచుకుంటాడు. ఇది మహా

మాయ. ఇందులో నుండి ఎవడూ బయటకి రాలేదు. దేహం కావాలి, దేహం కావాలి అని ఏడుస్తాడు. అప్పుడు దేహాన్ని ఇస్తాడు, ఆ దేహాన్ని ఉపయోగించుకుని వాడు జ్ఞానాన్ని సంపాదించడు, దేహాన్ని ఆధారంగా పెట్టుకుని ఆ దేహమే నేను అనేబుద్ధిని పెంచుకుంటూ, ఆ దేహాన్ని బట్టి మళ్ళీ అజ్ఞానాన్ని పెంచుకుంటాడు, మళ్ళీ అహంభావనని పెంచుకుంటాడు, నరకానికి మెట్లు కట్టుకుంటాడు. కొంతమంది తోటిమనుషులు బాధపడుతుంటే ఆ బాధని చూసి సంతోషిస్తూ ఉంటారు, అది క్రూరత్వం యొక్క స్వభావం. ఎదుటిమనిషి బాధపడుతుంటే ఆ బాధని చూసి వీడు సంతోషిస్తాడు. దానివల్ల వీళ్ళకేమి కలిసిరాదు, ఈ లోకంలో రెండు రకాల మనుషులు ఉంటారు. కొంతమంది స్వార్థంగా ఉంటారు, కొంతమంది క్రూరత్వంగా ఉంటారు. కొంతమందికి రెండు కలుస్తాయి. అటువంటి వాళ్ళతోటి చాలా ప్రమాదం.

భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నీకు దేహం వచ్చింది, ఆ దేహ పోషణకు సరిపడ పనిచేసుకొంటూ ఇతరుల గొడవలలో ఎక్కువ కలుగజేసుకోవద్దు. సమాజం తోటి అసలు సంబంధం లేకుండా మనం ఉండలేము. అందుచేత సమాజం తోటి మనకి ఎంతవరకు అవసరమో అంతవరకే ఉండాలి కానీ అతిగా ఉండకూడదు. నీకు ఆహారం ఎంతవరకు అవసరమో అంతవరకే నువ్వు తీసుకో, కనిపించిన పుస్తకాలు అన్నీ చదవకు, కనిపించిన వారి అందరితో స్నేహాలు చెయ్యకు. కొంతమంది కనిపించిన పుస్తకాలు అన్నీ చదువుతారు దానివల్ల లాభం కంటే నష్టం ఎక్కువ ఉంటుంది. స్నేహలు కూడా తగుమాత్రంగా చెయ్యి. ఎంతవరకు అవసరమో అంతవరకే చెయ్యి. ఆచార్యులవారు చెప్పినట్టుగా holy company ని నీ ప్రాణం తోటి సమానంగా చూసుకో. నీ లోపల ఉన్న బ్రహ్మమును తెలుసుకోవడానికి దేహాన్ని ఉపయోగించుకోవాలి. కానీ జీవుడు ఏమి చేస్తున్నాడు? దేహాన్ని ఆధారంగా చేసుకుని అహంభావనని పెంచేసుకుని చనిపోయిన తరువాత కటిక చీకటిలోకాల్లోకి వెళ్ళిపోతున్నాడు. ఇంక ఎవరు నిన్ను రక్షించేవాడు? భగవాన్ చెప్పే message ఏమిటి అంటే, నీకు దేహం వచ్చింది. ఆ దేహాన్ని ఆసరాగా తీసుకుని నువ్వు అహంభావనని పెంచుకుంటున్నావు. అలా కాదు, ఆ దేహాన్ని ఆసరాగా తీసుకుని నువ్వు అహంభావాన్ని reduce చేసుకోవాలి. నీకు వచ్చిన రూపాన్ని దానితోటి కలిసి పోకుండా నువ్వు జ్ఞానం సంపాదించడం కోసం ఆ

రూపాన్ని ఉపయోగించుకో, కానీ నువ్వు ఏమి చేస్తున్నావు అంటే ఆ రూపాన్ని జ్ఞానం సంపాదించుకోవడం కోసం ఉపయోగించుకోకుండా రూపబుద్ధి పెంచుకుని, చర్మబుద్ధి పెంచుకుని, అజ్ఞానం, అహంభావాన్ని పెంచుకుని నువ్వు చీకటిలోకాలకి పోతున్నావు.

భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీకు అనేక తలంపులు వస్తున్నాయి. అనేక కోరికలు వస్తున్నాయి, ఈ వాసనలు, ఈ సంస్కారాలు, ఈ కోరికలు నీకు అనేకజన్మల నుంచి వస్తున్నాయి. నువ్వు ఏమి చెయ్యాలి అంటే ఈ bodyboundకి సంబంధించిన కోరికలని ఒక్కొక్క కోరికని, ఒక్కొక్క కోరికని eliminate చేసుకుంటూ రావాలి. నీకు ఇప్పుడు క్రోధం ఉంది అనుకోండి, క్రోధం తలంపు రూపంలో వస్తుంది. కామం ఉంది అనుకోండి, కామం తలంపు రూపంలో వస్తుంది. అసూయ ఉంది అనుకోండి, మీకు అసూయ తలంపు రూపంలో వస్తుంది, తలంపు లేకపోతే ఏది లేదు. చావు కూడా తలంపే, పుట్టుక కూడా తలంపే, రాగం కూడా తలంపే, ఇష్టం కూడా తలంపే, అయిష్టం కూడా తలంపే. నీలో ఉన్న పాపం, నీలో ఉన్న దోషం, నీలో ఉన్న బలహీనతలు అన్నీ తలంపుల రూపంలో వస్తాయి. ఆ తలంపుల్ని actionలో పెట్టకుండా ఆ తలంపుల్ని సాధన చేసి తొలగించుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటే నీ స్వరూపస్థితి నీకు వ్యక్తం అవుతుంది.

స్వరూపం అరూపమే! భగవంతుడికి రూపం లేదు, నామం లేదు. ఊరికే అవసరాన్ని బట్టి ఒక రూపాన్ని ధరిస్తాడు, ఒక నామాన్ని పెట్టుకుంటాడు. అంతేకానీ ఆయనకి రూపం లేదు, నామం లేదు. నాకు రూపం లేకపోయినా, నాకు నామం లేకపోయినా, నాకు పుట్టుక లేకపోయినా, నేను మానవమాత్రుడిని అనుకుని అందరూ నన్ను అగౌరవ పరుస్తున్నారు అని కృష్ణుడు గీతలో చెప్పాడు. ఆయనకి రూపం లేదు, ఆయనకి నామం లేదు. ఆయన కూడా మనలాగే శరీరం ధరించి పుట్టాడు అనుకుని, ఆయనని కూడా మనిషి అనుకుని అగౌరవ పరుస్తున్నాం. కృష్ణుడు జైల్లో జన్మించాడు. అక్కడ గోడ మీద ఏమని రాశారు అంటే కృష్ణుడు పుట్టిన వాడివలె కనిపించాడు అని రాశారు అంతే, పుట్టాడు అని చెప్పలేదు. ఈ గదిలో పుట్టిన వాడివలె కనిపించాడు. దేవుడు పుట్టడు, పుట్టినవాడివలె కనిపించాడు. అంటే మనం ఋషులు, యోగులు అని ఎవరిని అంటున్నాం అంటే ఆ చైతన్యశక్తి, ఆ

పరమాత్మశక్తి, ఆ ఉదాత్తమైనశక్తి, ఆ వ్యాపకశక్తి ఏ ఉపాధి ద్వారా ఎక్కువ వ్యక్తం అవుతుందో వాళ్ళనే ఋషి అని, యోగి అని, అవతారపురుషుడు అని మనం అంటున్నాం.

షిరిడి సాయిబాబా ఉన్నారు, భౌతికంగా ఆయన ఎంతో మనం అంతే. ఆయనకి రెండు కాళ్ళే ఉన్నాయి, మనకి రెండు కాళ్ళే ఉన్నాయి. ఆయనకి రెండు చేతులే, మనకి రెండు చేతులే ఆయన మనలాగే ఆహారం తీసుకున్నారు. బాహ్యంగా చూస్తే ఆయన, మనం సమానమే. మరి దేవుడు, దేవుడు అని ఎందుకు అంటున్నాం? చైతన్యశక్తి, జ్ఞానశక్తి ఆ ఉపాధి ద్వారా ఎక్కువ వ్యక్తం అయ్యింది కాబట్టి ఆయన్ని సిద్ధపురుషుడు అంటున్నాం. సిద్ధపురుషుడు అంటే ఏమిటంటే మన హృదయంలో ఒక వస్తువు సిద్ధంగా ఉంది. దానికి పుట్టుక లేదు, దానికి మరణం లేదు. ఆ సిద్ధంగా ఉన్న వస్తువుని ఎవడైతే తెలుసుకున్నాడో వాడే సిద్ధపురుషుడు. షిరిడిసాయిబాబా సిద్ధపురుషుడు. ఆయన హృదయం లోనిది ఆయన తెలుసుకున్నాడు, అందుచేత సిద్ధపురుషుడు అయ్యాడు. మన హృదయంలో ఉన్నది మనం కూడా తెలుసుకుంటే మనం కూడా సిద్ధపురుషులం అవుతాం. భగవాన్ అనేవారు నీ హృదయంలో లేనిది నా హృదయంలో ఏదీ లేదు. నాలో ఏది ఉందో నీలో కూడా అదే ఉంది. తెలియటం, తెలియకపోవడం ఒక్కటే తేడా. భగవంతుడు అందరి హృదయాలలోను చైతన్యంగా ఉన్నాడు. అందరి హృదయాలలోను ఆత్మగా ఉన్నాడు. ఒకచోట ఉండి మరొకచోట లేకపోతే వాడు దేవుడే కాదు.

మాకు ఇంద్రియాలు తెలుస్తున్నాయి, విషయాలు తెలుస్తున్నాయి, విషయ సుఖాలు తెలుస్తున్నాయి, మా దేహాలు మాకు తెలుస్తున్నాయి. అంతేకానీ మాకు ఆత్మతెలియడం లేదు అని అందరూ అంటున్నారు, బొత్తిగా తెలియకుండా ఉన్నారా మీరు ఆత్మని? ఆత్మఅందరికీ తెలుసు. లోకంలో ఎంతోమంది చనిపోతున్నారు. ఆ చనిపోయిన వాళ్ళు అందరినీ జీవించి ఉన్నవాళ్ళు చూస్తున్నారు, మీ కళ్ల తోటి అనేక చావులని మీరు చూసి ఉంటారు స్మశానానికి వెళ్లకపోయినా, కానీ ఎన్ని చావులు మీరు చూస్తున్నప్పటికీ మీ హృదయం యొక్క లోతుల్లో, మనకి ఏమీ ఇబ్బంది లేదని, మనకి ఏమీ ఫరవాలేదు అని మీకు అనిపిస్తూ ఉంటుంది. పాపం వంద సంవత్సరాల ముసలమ్మ కూడా అలాగే అనుకుంటుంది నాకేమి ఫరవాలేదు అని.

ఎందుచేత అలా అనుకుంటుంది అంటున్నారు భగవాన్. ఆ ముసలమ్మ తన కళ్లతోటి తనకంటే చిన్నవాళ్ళు చనిపోవడం కూడా చూస్తుంది. అయ్యో పాపం మా మనవడు చనిపోయాడు అనుకుంటుంది అట కానీ మనకేమి ఇబ్బంది లేదు, మనకి ఇంతలో ఏమీ చావు రాదు అని అనుకుంటుంది, ఎందుచేత? ఆత్మగురించి ఎంతో కొంత తెలుస్తుంది ఆ ముసలమ్మకి, అంటే ఆత్మకి చావు లేదు. తాను ఆత్మఅయ్యి ఉంది అందుచేత నాకేమి ఇబ్బంది లేదు అనుకుంటుంది, తెలియకపోయినా ఆ భావన అలా వస్తుంది. ఎంత అపూర్వమైన టీచింగ్ చూడండి. ఇప్పుడు ప్రతీ మనిషి చనిపోతాడు, ఆ చనిపోయేవాడిని వీడు చూస్తూ ఉంటాడు. అయినా మనకేమి ఇబ్బంది లేదు అనిపిస్తుంది, ఎందుచేత అనిపిస్తుంది? వాడికి ఆత్మగురించి తెలియకపోయినా ఆత్మకి చావు లేదు. అందుచేత నాకు ఏమీ ఫరవాలేదు నేను చనిపోను అనుకుంటాడు. ఆత్మగురించి ఏదీ తెలియదు అంటావేంటి నీకు తెలుస్తోంది కదా కొద్దోగొప్పో అంటున్నారు భగవాన్. మీకు ఆత్మగురించి ఏమీ తెలియదు అనుకుంటున్నారు, కానీ ఎంతోకొంత మీకు తెలియకుండానే తెలుస్తోంది. దానికి సంబంధించిన ఎంతోకొంత ఎరుక మీకు ఉంది. ఆత్మకి చావు లేదు, అందుచేత మీకు కూడా చావు అంటే ఇష్టం లేదు. మీరు చనిపోతారు అని ఎవరైనా అంటే మీరు ఇష్టపడతారా? మేము ఇలాగే ఉండాలి, మాకు చావు రాకూడదు అనుకుంటారు, ఎందుచేత అంటే మీ స్వరూపంలో చావు లేదు. ఆ ముసలమ్మ స్వరూపంలో చావు లేదు అందుచేత ఎన్ని చావులు చూసినప్పటికీ మనకి ఏమీ ఇబ్బంది లేదు అనుకుంటుంది. అంటే ఆత్మగురించి స్పష్టంగా తెలియకపోయినా అస్పష్టంగా కొంచెం తెలుస్తోంది కదా అంటున్నారు.

పరమ స్పష్టః విష్ణుసహస్రనామాలలో చెప్పారు, ఆత్మఎటువంటిది అంటే పరమ స్పష్టః చీకటిలో చూసినట్టు కాదు. సూర్యుడి యొక్క వెలుతురులో నేను మిమ్మల్ని ఎంత స్పష్టంగా చూస్తున్నానో, మీరు నన్ను ఎంత స్పష్టంగా చూస్తున్నారో మీ హృదయంలోని ఆ సత్యవస్తువు, ఆ సద్వస్తువు పరమ స్పష్టః అతి స్పష్టంగా, క్లియర్‌గా, ఎంతో క్లారిటీగా మీకు అది కనిపిస్తుంది. ఆ విష్ణువు మీకు ఎలా కనిపిస్తాడు అంటే పరమ స్పష్టః అస్పష్టంగా కనపడడు, స్పష్టంగా కనిపిస్తాడు. ఆయన జ్ఞాన గమ్యః జ్ఞానం చేత మటుకే ఆ విష్ణువు మీకు తెలియబడతాడు కానీ మొద్దుఅబ్బాయిలకి, బలహీనులకి, బద్ధకస్తులకి, సోమరిపోతులకి

తెలియబడదు. అందరి హృదయాలలో విష్ణువు ఉన్నమాట నిజమే, జ్ఞానం వలన మాత్రమే వాడు పొందబడతాడు, విష్ణుసహస్రనామాలలో ఈ మాట ఉంది, ఈ మాటలు ఎంత బాగున్నాయో చూడండి. జ్ఞాన గమ్యః ఎవడైతే జ్ఞానం సంపాదించి ఆ విష్ణువును పొందాడో, ఆ విష్ణువు మసక చీకట్లో ఉన్నట్టు కనపడదు. పరమ స్పష్టః సూర్యకాంతిలో మీరు నాకు ఎంత స్పష్టంగా కనబడుతున్నారో, నేను మీకు ఎంత స్పష్టంగా కనబడుతున్నానో, అంత స్పష్టంగా ఆ వస్తువు మీకు ఎరుకలోకి వస్తుంది, అస్పష్టంగా కనిపించదు, స్పష్టంగానే కనిపిస్తుంది. మీరు తొందరపడకండి. కాలక్రమంలో మీ ఉపాసనబలం వల్ల, మీ జ్ఞానబలం వల్ల, మీ సత్ప్రవర్తన యొక్క బలం వల్ల, మీ చైతన్యస్థాయి వల్ల, మీరు సముపార్జించిన జ్ఞానం వల్ల ఆ విష్ణువు మీ హృదయంలో స్పష్టంగా వ్యక్తం అవుతాడు. అది ఎప్పుడో కాదు, ఇక్కడే ఇప్పుడే ఈ శరీరంలో మీరు ఉండగానే భగవంతుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు అయినటువంటి ఆ విష్ణువు నీ హృదయంలో నీకు తానుగా, నేనుగా వ్యక్తం అవుతాడు.

విష్ణువు అంతటా ఉన్నాడు, వాడు ఎప్పుడైతే నీకు అనుభవంలోకి వచ్చాడో నేను కూడా అంతటా ఉన్నాను అన్న సంగతి నీకు అనుభవంలోకి వస్తుంది. ఈ టీచింగ్ ఎంత అద్భుతంగా ఉందో చూడండి ఈ ఐదు అడుగుల దేహం ఎక్కడ ఉంటే అక్కడే ఉన్నాం అని మనం అనుకుంటున్నాం, కానీ అలా కాదు. నీ సాధనాబలం వల్ల, నీ ఉపాసనాబలం వల్ల విష్ణువు ఎప్పుడైతే నీకు వ్యక్తం అయ్యాడో, ఆ విష్ణువు అంతటా ఉన్నాడు కాబట్టి నువ్వు అంతటా ఉన్నావు అన్న సంగతి అప్పుడు నీకు వ్యక్తం అవుతుంది. అప్పుడు నీకు చావు లేదు, పుట్టుక లేదు, going లేదు, coming లేదు. మనం రాత్రి నిద్రపోతాము, పది

**మానవుడి యొక్క స్వార్థం, కుయుక్తులు, కుతంత్రాలు, కుచేష్టలు, మనస్సుని హృదయాభిముఖంగా ప్రయాణం చేయకుండా పట్టి ఉంచుతాయి. మనస్సు ఎప్పుడైతే ఈ లోపాల నుండి, అలవాట్ల నుండి విడుదల పొందిందో, తనంతట తానుగా అది హృదయగుహలో పడిపోతుంది.**



అయ్యిపోయింది నిద్ర వచ్చేస్తోంది అంటాము. ఎవరికి నిద్ర వస్తుంది? అహంకారానికి నిద్ర వస్తుంది. రాత్రుళ్ళు అహంకారం శుభ్రంగా పడుకుంటుంది. ఉదయాన్నే మనకంటే ముందు లేచి మన నెత్తిమీద అహంకారం కూర్చొంటుంది. ఇవాళ ఎవడిని కొడదామా? ఎవడిని తిడదామా? ఎవడి కొంప ఆర్పేద్దాం? ఎవరి మీద కక్ష తీర్చుకుందాం? ఇదే గొడవ. ఉదయాన్నే మనకు మెలకువ వచ్చింది, మెలకువ వచ్చింది అంటే ఎవడికి మెలకువ వచ్చింది? జ్ఞానంలో మనకి మెలకువ రాలేదు, అహంకారానికి మెలకువ వచ్చింది. మళ్ళీ రాత్రి పడుకునేవరకు అహంకారం గొడవలో ఉండడం. మళ్ళీ రాత్రి పడుకునేటపుడు ఎవరు పడుకుంటున్నారు? ఈ అహంకారం పడుకుంటుంది. పొద్దున్నలేచేది అహంకారమే, పడుకునేది అహంకారమే. రాత్రి ఆ భగవంతుడి దయ వల్ల ఐదు, ఆరు గంటలు అది శుభ్రంగా మనలని అల్లరి చెయ్యకుండా, గొడవ చెయ్యకుండా అహంకారం అలా పడుకుని ఉంటుంది. ఉదయాన్నే అది లేచాక మనకి మెలకువ వస్తుంది.

నేను సుబ్బారాయుడిని అనుకోండి, నేను సుబ్బారాయుడిని అని నాకు ఎప్పుడు తెలుస్తుంది? మెలకువ వచ్చాక, ఈ అహంకారం వచ్చాకే నేను సుబ్బారాయుడిని అని నాకు తెలుస్తుంది. మీకు నిద్రలో సుబ్బారాయుడి గొడవ ఏమీ ఉండదు. మెలకువ వచ్చాక నేను సుబ్బారాయుడిని అని మీకు తెలుస్తుంది కానీ నిద్రలో ఏమీ ఉండదు. నేను ఎల్లమ్మని, నేను పుల్లమ్మని అని నిద్రలో మీరు అనుకుంటారా? అనుకోరు. నేను పుల్లమ్మని అని ఒక రూపం తోటి తాదాత్మ్యం , ఒక పేరు తోటి తాదాత్మ్యం , మీకు మెలకువ వచ్చాక వస్తుంది కానీ నిద్రలో ఏమీ లేదు. అంటే మీరు ఎక్కడకి మేల్కొంటున్నారు? అహంకారంలోకి మేల్కొంటున్నారు. అహంకారంలోకి మేల్కొన్నాక మీ రూపం మీ అహంకారాన్ని పెంచేస్తుంది, ఇది మహామాయ. ఎవరో అవతారపురుషుడి యొక్క interference వల్ల ఇందులోంచి మనం బయటకి రావాలి కానీ, కామన్‌మాన్ ఎవడూ మనల్ని రక్షించలేడు.

అహంభావన అంటే ఏమిటి అంటే, దేహం తోటి తాదాత్మ్యం పొందినబుద్ధి. అంటే నీ అస్థిత్వాన్ని దేహానికి కనుక పరిమితం చేసుకుంటే అది అహంభావన. వేదాంత పరిభాషలో దానినే దేహాత్మబుద్ధి అంటారు. నువ్వు ఎవరు? ఆత్మవే కానీ నువ్వు ఏమనుకుంటున్నావు?

దేహాన్ని అనుకుంటున్నావు, అదే అహంకారం. ఇప్పుడు భగవాన్ చెప్పేది ఏమిటి అంటే అహంకారం మొత్తాన్ని మీరు తీసేయక్కర్లేదు, ఆ కారం తీసేయండి సరిపోతుంది. బ్రహ్మానుభవం పొందిన తరువాత కూడా నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తూనే ఉంటుంది, దానివల్ల ప్రమాదం లేదు. I am this, I am that, దానితోటో, దీనితోటో నువ్వు తాదాత్మ్యం పొందడం మానేస్తే నీకు కారం తగ్గిపోతుంది అన్నారు. I am అనుకో దానితో నీకు ఇబ్బంది లేదు. I am this అనుకున్నా కారమే, I am that అనుకున్నా కారమే. మీకు అర్థం అవుతోందా? I am that అనుకోకు, I am this అనుకోకు, I am అనుకో. అహంకారం మొత్తాన్ని తీసేయక్కర్లేదు ఆ కారాన్ని తీసేస్తే సరిపోతుంది నీకు జ్ఞానం వచ్చేస్తుంది అంటున్నారు స్వాములవారు. రమణమహర్షి గారు ఏమని చెప్పారు అంటే ఎంతసేపు నీ మనస్సును బయట దేని మీద నిలబెడదామా అని చూస్తున్నావు, నీ మనస్సును ఏ బొమ్మ మీద నిలబెడదాము? నాసికాగ్రం మీద నిలబెడదామా? అని చూస్తున్నావు. అలా కాదు, ఈ నేను ఒకటి నీకు తెలుస్తోంది కదా ఆ నేను మీద నిలబెట్టు, ముందు దాని గొడవ వదిలించుకో నువ్వు, నీ మనస్సును బయట దానిమీద నిలబెడదాం అని చూస్తున్నావు కానీ ఈ నేను మీద నిలబెట్టడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి అంటున్నారు.

మనస్సు అంటే ఏమిటి? అనేక సంస్కారాల యొక్క మూట, అనేక తలంపుల యొక్క మూట. స్వామీజీ ఏమంటున్నారు అంటే ఈ మనస్సు తోటి మీరు పెద్ద పేచీ పెట్టుకోవద్దు. ఈ మనస్సు తోటి పేచీ పెట్టుకుంటే అది ఇంకా లెగుస్తూ ఉంటుంది, దానిని రెచ్చగొట్టకండి. పొయ్యిలో పుల్లలు ఉన్నాయి అనుకోండి, ఒక్కొక్క పుల్ల, ఒక్కొక్క పుల్ల మీరు బయటకి లాగేశారు అనుకోండి మంట ఆరిపోతుంది. అదేవిధంగా మీ మనసులో ఉన్న తలంపులు ఒక్కొక్క తలంపు, ఒక్కొక్క తలంపు బయటకి లాగేస్తే మనసు దానంతట అదే చనిపోతుంది అన్నారు స్వామీజీ. మీ మనసులో ఉన్న సంస్కారాలని ఒక్కొక్కటి, ఒక్కొక్కటి మీరు బయటకి తీసేయండి. ఒక్కొక్కటి బయటకి తీసేస్తే మీ మనసు అనేది మీకు కనపడదు. మీకు బంధకారణం అయిన తలంపులు వస్తూ ఉంటే ఈ తలంపులు ఏ నేనుకి వస్తున్నాయి అని ఏదైతే మీరు నేను అంటున్నారో ఆ నేనుని మీరు ప్రశ్నించండి

నువ్వు ఎవరవుఅని. దానిని ప్రశ్నించరు అనుకోండి కొన్ని కోట్ల జన్మలు మీరు ఇలా తిరగవలసి ఉంటుంది అన్నారు రమణస్వామి. మీరు ఏదైతే నేను నేను అంటున్నారో ఆ నేనుని నువ్వు ఎవరవు అని ప్రశ్నించుకోండి. దానిని విచారణ చెయ్యకుండా, అది ఎక్కడ నుంచి వస్తోందో దాని పుట్టుకస్థానం కనుక మీకు తెలియకపోతే కొన్ని కోట్ల శవాలు మీరు మోయవలసి ఉంటుంది. అందుచేత ఏదైతే మీకు నేనుగా వ్యక్తం అవుతోందో దానిని నువ్వు ఎవరవు అని ప్రశ్నించి దాని మూలాన్ని తెలుసుకోండి, దానిని విచారణ చేస్తే ఆ నేను పోతుంది, విచారణ చెయ్యకపోతే అదే కోటిజన్మలకి మీ కూడా వస్తుంది. ఇది బాగా అర్థం చేసుకోండి. ఆ నేనుని విచారణ కనుక మీరు చేస్తే ఈ దేహంలో ఉండగానే దేహగతమైన నేను నశిస్తుంది. ఆ నేనుని విచారణ మీరు చెయ్యరు అనుకోండి, కోటిజన్మలకి కూడా ఆ సైతాను మీ కూడానే వస్తుంది, మీ దుఃఖానికి కారణం అదే. మీరు విచారణ చేస్తే నశిస్తుంది, మీరు విచారణ చెయ్యరు అనుకోండి, ధ్యానం చెయ్యరు అనుకోండి, ఆ నేను ఎవరో మీరు ప్రశ్నించరు అనుకోండి, జపం చెయ్యరు అనుకోండి, అది నశించదు, కోటిజన్మలు ఎత్తినా నశించదు మీరు పురుష ప్రయత్నం చెయ్యకపోతే!

ఆచార్యులవారు ఒక ప్రశ్న అడిగారు ఎవడు చనిపోయిన వాడితోటి సమానం అన్నారు. ఎవడైతే ముక్కులో గాలి తిరుగుతున్నప్పటికీ, know god in your heart, వాడి హృదయంలో ఉన్న భగవంతుడిని తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యడో, వాడి ముక్కులో గాలి తిరుగుతున్నా కూడా వాడు చనిపోయిన వాడితోటి సమానం అని చెప్పారు. ఇప్పుడు మనం అందరం చనిపోయినవాడితోటి సమానం, అంటే భౌతికంగా బ్రతికి ఉన్నాము కాని ఆచార్యులవారి దృష్టిలో మనం చనిపోయినవాడితోటి సమానం. నీ ముక్కులో గాలి తిరుగుతున్నా నువ్వు చనిపోయినవాడితోటి సమానమే, ఎందుచేత అంటే నీ హృదయంలో ఒక భగవంతుడు ఉన్నాడు. ఆయన అనుభవం పొందడం కోసం నువ్వు ఎంతోకొంత ప్రయత్నం చెయ్యాలి. ఆ ప్రయత్నం చెయ్యకపోతే నువ్వు జీవించి ఉన్నా చనిపోయిన వాడితోటి సమానం.

**ఓం శాంతిః శాంతిః శాంతిః శాంతిః**

# ప్రసాదబుద్ధి

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

తల్లి గర్భంలోంచి మన శరీరం బయటకి వచ్చాక స్మశానంలోకి వెళ్ళే వరకు మనకి జీవితంలో కష్టం, సుఖం వస్తూ ఉంటాయి. ఈశ్వరుడు యొక్క ప్రసాదం ఎంత గౌరవంగా, భక్తిగా మనం స్వీకరిస్తామో, ఎంత ప్రశాంతంగా గుడిలో ప్రసాదాన్ని స్వీకరిస్తామో, అలాగే మన జీవితంలో కష్టం వచ్చినా, సుఖం వచ్చినా అది ఈశ్వరుడి ప్రసాదంగా స్వీకరించి, దానిని ప్రశాంతంగా, భక్తిగా మనం భరిస్తే దానినే ప్రసాదబుద్ధి అంటారు.

అటువంటి ప్రసాదబుద్ధి ఎవడికి అయితే కలిగిందో వాడు మోక్షం దగ్గరకి వెళ్ళక్కరలేదు, మోక్షమే వాడి దగ్గరకు వచ్చి వరిస్తుంది. గురువు దగ్గరకు వాడు వెళ్ళక్కరలేదు, గురువే వాడి దగ్గరకు వస్తాడు. వైకుంఠం దగ్గరకి వాడు వెళ్ళక్కరలేదు, వైకుంఠమే వాడి దగ్గరకు వస్తుంది. వాడికి స్వర్గరాజ్యం తలుపులు మూసి ఉండవు, తెరువబడి ఉంటాయి, వాడు తలుపు కొట్టక్కరలేదు. మన మనస్సుని, మన బుద్ధిని ఈశ్వరుడికి సమర్పించి, ఈశ్వరుడిని నిరంతరం ధ్యానం చేస్తుంటే ఈశ్వరుడి పాదాలు మనకి దొరుకుతాయి.

అందుచేత ఇంట్లో మిమ్మల్ని ఎవరైనా అగౌరవపరుస్తుంటే, అది మీకు మంచి అవకాశం ఇచ్చినట్లే. దాని వలన మీకున్న మమకారం తగ్గిపోతుంది. మీకున్న మమకారం, అహంకారం తగ్గిపోవటం వలన మీరు భగవంతుడికి దగ్గర అవుతారు. మనకి ఎప్పుడైనా దుఃఖం వస్తే, ఏదైనా బెంగ వస్తే, బాధ వస్తే, మనకి ఏదైనా మోహం వస్తే, అది మన అహంకారమే. ఇది కొండ గుర్తు. ఆత్మకి, అహంకారానికి ఎట్టి సంబంధం లేదు. మనం నేను నేను అనే ఈ నేనుకి, ఆత్మకి రవ్వంత, ముల్లంత కూడా సంబంధం లేదు.

మన హృదయంలో భగవంతుడు ప్రకాశిస్తున్నాడు. మన హృదయములో ఆత్మ ప్రకాశిస్తోంది. కానీ కుండలో నీళ్ళు ఉన్నప్పటికీ, కుండపైన మూత ఉంటే ఆ నీళ్ళు ఏ విధంగా అయితే కనబడవో అలాగే ఈ అహంకారం అనే మూత మన హృదయం మీద ఉంది కాబట్టి మన హృదయంలో ఉన్న భగవంతుడు మనకు వ్యక్తమవ్వడు. ఈ అహంకారం అనే మూత తీసివేస్తే మన హృదయంలో ఉన్న భగవంతుడు దర్శనం ఇస్తాడు. అన్ని సంస్కారాలు క్షయం అయితే, అన్ని వాసనలు క్షయం అయితే, అప్పుడు అహంకారం అనే మూత బయటకి పడుతుంది. అహంకారం అనే మూత ఎప్పుడైతే తొలగిందో, ఉన్న

వస్తువు ఉన్నట్లుగా కనిపిస్తుంది. ఏ కారణంచేత మీకు దుఃఖం వచ్చినప్పటికీ మీలో ఉండి రోధించేది మీలోని అహంకారం మాత్రమే. మనం ఏ జన్మలోకి వెళ్ళినా, ఏ లోకంలోకి వెళ్ళినా ఆహంకారం పోగొట్టుకోవలసిందే. తెల్లబట్టలు కట్టుకున్నా, ఎర్రబట్టలు కట్టుకున్నా అహంకారం పోగొట్టుకోవలసిందే. ఇంటి దగ్గర ఉన్నా, అరణ్యానికి వెళ్ళినా, తపస్సులు చేసినా అహంకారం పోగొట్టుకోవలసిందే. అందుచేత ఎవడైతే అహంకారం పోగొట్టుకోవటానికి జీవిస్తున్నాడో వాడి పాపం క్షయం అవుతుంది, వాడే తపస్సు చేస్తున్నట్లు లెక్క. ఇది బాగా జ్ఞాపకం ఉంచుకోండి. అహంకారం పోయేవరకు ఎవరికీ నిజం అనేది తెలియదు, తెలియబడదు. అహంకారం పోయినవాడికి మాత్రమే నిజం తెలుస్తుంది.

మనకు వచ్చే కష్టసుఖాలు అన్నిటినీ నిర్మలమైన బుద్ధితోటి, నిర్మలమైన మనస్సుతోటి, నిర్మలమైన అంతఃకరణతోటి మనం అనుభవించేస్తే ఆ పాపం పోతుంది, ఆ దోషం పోతుంది. మళ్ళీ మనకి చక్కటి జన్మ కలుగుతుంది, మోక్ష స్థితి కలుగుతుంది. అయితే ప్రశాంతంగా అనుభవించాలి. రియాక్షన్ లేకుండా అనుభవించాలి. అదే ప్రసాదబుద్ధి. అటువంటి ప్రసాదబుద్ధి ఎవడికి అయితే కలిగిందో ఆ జీవుడిని చూసినప్పుడు ఈశ్వరుడి శరీరం పులకరించి, అతను వద్దన్నా వెళ్ళి మోక్షసామ్రాజ్యానికి, శాంతిసామ్రాజ్యానికి, ఆత్మ సామ్రాజ్యానికి పట్టాభిషేకం చేస్తాడు. ప్రసాదబుద్ధితో సుఖదుఃఖాలు అనుభవించే వాడికి భగవంతుడు తన స్వరూపాన్ని ఇస్తాడు.

మనందరికీ ఆత్మజ్ఞానం పంచిపెట్టటానికే కృష్ణుడు కానీ, రాముడు కానీ, గౌతమ బుద్ధుడు కానీ, రమణమహర్షి కానీ ఈ లోకంలోకి వచ్చారు. మనం సుఖశాంతులతో సంతోషంగా జీవితం గడపాలని మన కోసం వాళ్ళ జీవితాలు అంతా ఖర్చు పెట్టారు. వాళ్ళ లాగా మనల్ని జ్ఞానులు చెయ్యాలి అని అనేక కోణాల నుండి ఈ సబ్జక్టు మనకి బోధించారు. అందుచేత ఆత్మని తెలుసుకోవడానికి నిరంతరం కృషి చేస్తూ, రాగద్వేషాలు పెట్టుకోకుండా మనం నిమిత్తమాత్రంగా పనులు చేసుకోవాలి. బాహ్యపరిస్థితులు చూసి మనం కంగారుపడకుండా మన మనసుని నిర్మలంగా నిదానంగా పెట్టుకుని, నిరంతరం ఆత్మని, భగవంతుడిని స్మరిస్తూ కాలక్షేపం చెయ్యాలి. మీ కుటుంబ విషయాలు జాగ్రత్తగా చూసుకుంటూ మీరు సాధన చేసుకోండి. మీకు అక్కరలేని గొడవలలోకి మీరు వెళ్ళకండి. దానివల్ల కాలం ఖర్చు అయిపోతుంది. జరిగిపోయిన కాలం మళ్ళీ రాదు. ఉన్న కాలాన్ని సాధన కోసం జాగ్రత్తగా ఉపయోగించుకోండి. సాధన లేకుండా సిద్ధి కలుగదు. సిద్ధి అంటే జ్ఞానం.

## WHERE THE JOURNEY ENDS IN SILENCE!

My journey with Nanna has been nothing short of a miracle—one woven with love, grace, and quiet transformation. When I look back now, it feels as if every step, every turn, every joy and every challenge was arranged out of an immense compassion that I did not fully understand back then.

If I were to describe this journey in simple words:

Joy In The Beginning,

Conflict In The Middle,

Glory In The End.

And through all of it, Nanna walked with me—guiding, protecting, and carrying me in ways I could have never imagined.

**Joy in the Beginning :**

Nannagaru attracted me in a way I cannot explain. I loved him — not just as a Guru, but as a father. When I met him, I was not searching for liberation or truth. I simply found myself drawn to him effortlessly, naturally. The love was unquestioning, and the trust was complete.

Listening to his words, reading his books, even remembering him—brought peace and sweetness to my heart. Those early days were filled with sweetness and joy.

**Conflict in the Middle :**

As time passed, merely listening was no longer enough. I began to feel the responsibility of living his teaching. And that is where the inner struggle began. The mind, with all its desires, habits, and attachments, did not want to cooperate. I could clearly see what was right, what was true — yet the heart pulled towards what was comfortable, familiar, and worldly. This inner tug-of-war created conflict, not because of life outside, but because of the tendencies within. As long as the mind exists, Maya exists — and this phase revealed how deeply rooted those tendencies were.

Once I even asked Nanna, when we were on our way to his speech in the car

"Nanna, how can we conquer Maya?"

He replied, "I will give you the answer in my speech."

That evening he said in his speech:

"Maya cannot be conquered by your efforts alone. Guru's Grace is needed."

Another unforgettable experience with Nanna was in Jinnuru when I told him:

"Nanna, I am really enjoying the subject a lot."

He replied gently:

"Who is the enjoyer? Find the enjoyer."

It was not only instruction—it was initiation. It was the turning point. The meaning was clear:

Do not get lost in enjoyment even if you are enjoying God's subject or teachings. Find the one who enjoys. Ask — Who am I?

Finding who am I meant he wanted me to now, travel inwards and find out the "real I" which is the source, the Brahmam, Chaitanyam that is within.

At that time, I did not realise the depth of what he had said.

The question "Who am I?" began to rise naturally. The Guru outside was slowly turning me towards the Guru within. I realized that he had not brought me for peace alone. He had greater plans for me—plans I could not have imagined. He wanted to give me something far more profound than worldly contentment. To prepare me, he gently removed the strongest desires of my heart—attachments I believed were essential to my happiness. What I thought I could never live without, he took away with love.

Not to punish me,

not to make me suffer,

but to teach me Vairagya—freedom from dependence on anything outside.

And yet, it never felt painful.

He made my transformation so effortless that I did not even realize my life was turning completely.

The happiness I once chased outside began arising naturally within me. Moments of peace grew longer, and disturbances faded quicker. Whenever the mind trembled, all I had to do was remember him—and peace would return instantly.

**Glory in the End :**

Glory in the end because slowly, through his grace, something softened. When I finally stopped trying to control the journey and simply surrendered — fully, without conditions — everything changed. The teachings I once struggled to practice began to live themselves. Understanding bloomed effortlessly. Every step, every phase, suddenly made sense.

The path, the conflict, the letting go — all of it was meant to bring the mind home to the heart.

**The Silent Grace :**

One day, during a moment of restlessness, a question arose within:

"If God fulfilled your desire, would you exchange your peace for it?"

The answer came instantly:

No. Peace is greater than anything I could desire.

In that moment, the mind fell silent. Thoughts dissolved. What followed was a flood of peace—vast, deep, expansive—like a silent storm of stillness filling every part of my being. There are no words to describe that experience. The vibration was high and intense. The feeling remained with me the entire night.

The next morning, I experienced something so profound that words are not enough to describe it. I felt as though I was diving into a boundless ocean — without fear, without effort. I went so deep that there was no coming back. It was the most liberating experience of my life- So Profound, So Silent!

In that Silence, I remembered Nanna's words:

Undatam is Brahman.

Undatam is Chaitanyam.

Undatam is the Self.

Being itself is divine. 'I Am' is the only truth.

I Am Not This, I Am Not That,

I AM.

Nanna had given me the greatest gift one could ever receive:

The Gift Of Being,

The Gift Of Peace Without Reason,

The Gift Of Independent Happiness,

The Gift Of A Heart Overflowing With His Grace.

I do not know what I lost in this journey—but I know what I gained cannot be measured, described, or compared. My heart today is full—complete, steady, silent, and deeply content. My cup is overflowing with his blessings and his grace.

In This Resting, There Is Only Gratitude & Quiet, Unwavering Peace.

This birth is the gift of my parents.

But this life — this inner freedom, this steady peace — is the gift of my Guru.

When his physical form began to withdraw from this world, I was blessed to hold his hand one last time. He never left my hand, and he never will. I know one truth for sure that Nanna and his grace will be with me forever.

For as long as this body lives, and long after it dissolves,

I remain his — in love, in surrender, and in silence.

**Where the journey ends in silence... the Self alone remains!**

With quiet gratitude,

**Rohini Raju**

**(Hyderabad)**

# మౌనంలో ముగిసిన ప్రయాణం

నాన్నతో నా ప్రయాణం ఒక అద్భుతం. అది ప్రేమ, దయ మరియు మౌనంతో అల్లుకుంది. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే ప్రతి అడుగు, ప్రతి మలుపు, ప్రతి ఆనందం మరియు ప్రతి సమస్య ఆయన అపారమైన కరుణలోనుండి జరుగుతున్నట్లు అనిపిస్తుంది. ఆ ప్రయాణాన్ని సరళంగా చెప్పాలంటే ప్రారంభంలో ఆనందం, మధ్యలో సంఘర్షణ, చివరలో వైభవం. ప్రయాణం ఆసాంతం నేను ఊహించలేని విధంగా నాకు మార్గదర్శకం చేస్తూ, రక్షిస్తూ అన్నింటిలో నాన్న నాచేతిని పట్టుకుని నడిపించారు.

**ప్రారంభంలో ఆనందం :**

నేను వివరించలేని విధంగా నాన్నగారు నన్ను ఆకర్షించుకున్నారు. నేను ఆయనను గురువుగా, తండ్రిగా ప్రేమించాను. నేను ఆయనను కలిసినప్పుడు ముక్తిని పొందాలనే ఉద్దేశ్యం కాని, సత్యాన్వేషణ కానీ లేదు. కానీ అప్రయత్నంగా, సహజంగా నేను ఆయన వైపు ఆకర్షింపబడ్డాను. ఆయన ప్రేమ ప్రశ్నించలేనిది, ఆ సత్యం పరిపూర్ణమైనది. ఆయన మాటలు వినడం, ఆయన పుస్తకాలు చదవడం, ఆయనను స్మరించుకోవటం వలన నా హృదయానికి శాంతి, మాధుర్యం కలిగాయి.

**మధ్యలో సంఘర్షణ :**

కాలం గడిచే కొద్దీ కేవలం వినటం సరిపోలేదు. నేను ఆయన బోధనలను అనుసరించి జీవించాలని స్ఫురించింది. అక్కడే అంతర్గత పోరాటం మొదలైంది. మనసు దాని కోరికలు, అలవాట్లు, అనుబంధాల వల్ల సహకరించటానికి ఇష్టపడలేదు. ఏది నిజం? ఏది సరిఅయినది అని నేను స్పష్టంగా చూడగలిగినా, నా మనసు ప్రాపంచిక విషయాల వైపు లాగబడింది. ఈ అంతర్గత సంఘర్షణలకు కారణం లోపలఉన్న వాసనలే కానీ, బయట పరిస్థితులు కాదు. మనసు ఉన్నంతకాలం మాయ ఉంటుంది. ఈ దశలో నాలో ఉన్న వాసనలు ఎంతలోతుగా ఉన్నాయో తెలిసింది.

ఒకసారి నాన్నగారిని ఒక ప్రశ్న అడిగాను.

“నాన్నగారు మేము మాయను ఎలా జయించగలము?”

నేను ఈ రోజు ప్రసంగంలో నీకు సమాధానం ఇస్తాను అని చెప్పారు. ఆ సాయంత్రం ఆయన ప్రసంగంలో ఇలా చెప్పారు.

“మాయను కేవలం మీ ప్రయత్నాల ద్వారా జయించలేరు. గురుకృప లేకుండా అది సాధ్యం కాదు”.

నాన్నగారితో మరో మరుపురాని అనుభవం జిన్నూరులో జరిగింది. నేను మీరు చెప్పే సబ్జక్టును చాలా ఎంజాయ్ చేస్తున్నాను నాన్నా అన్నాను.

ఆయన మెల్లగా సమాధానం చెప్పారు.

“ఎంజాయ్ చేసేవాడు ఎవరు? ఆ ఎంజాయ్ చెసేవాడిని పట్టుకో. మీరు భగవంతుడిని, ఆయన బోధనను ఎంజాయ్ చేస్తున్నా, అంతటితో ఆగిపోకుండా ఆ ఎంజాయ్ చేసేవాడిని కనుగొనండి” అన్నారు.

అది కేవలం ఉపదేశం కాదు. అది ఒక మలుపు, ఒక దీక్ష!

నన్ను నేను కనుగొనడానికి లోపలకి ప్రయాణించి నిజమైననేనుని.... అంటే మూలాన్ని కనుగొనమని అదే చైతన్యం, అదే బ్రహ్మం అని నాన్న అంటున్నారు. ఆ సమయంలో ఆయన చెప్పినదాన్ని, ఆ లోతును నేను గ్రహించలేదు. కానీ ఆ తరువాత “నేను ఎవరు?” అనే ప్రశ్న సహజంగా రావడం ప్రారంభమైంది. బయటి గురువు నన్ను నెమ్మదిగా లోపలి గురువు వైపు మళ్ళిస్తున్నారు. నాకు కేవలం శాంతిని ఇవ్వడానికి మాత్రమే ఆయన తన దగ్గరకు నన్ను రప్పించలేదని గ్రహించాను. ఆయన నాకు ప్రాపంచిక సంతృప్తి కంటే చాలా లోతైనది ఇవ్వాలనుకున్నారు. నన్ను సిద్ధం చేయడానికి, ఆయన నా హృదయంలోని బలమైన కోరికలను మెల్లగా తొలగించారు. నా సంతోషానికి అవసరమని నేను నమ్మిన అనుబంధాలను, అవి లేకుండా జీవించలేనని అనుకున్న వాటిని ఆయన ప్రేమతో తీసివేసారు.

నన్ను శిక్షించడానికి కాదు, నన్ను బాధపెట్టడానికి కాదు, నాకు వైరాగ్యం నేర్పించడానికి, బయట దేనిపైనా ఆధారపడని స్వేచ్ఛ ఎలా ఉంటుందో తెలియజేయడం కోసం. కాబట్టి అది ఎప్పుడూ బాధాకరంగా అనిపించలేదు. ఆయన నా పరివర్తనను ఎంత సులభంగా, అప్రయత్నంగా చేసారంటే, నా జీవితం పూర్తిగా మారుతోందని నేను

గ్రహించేలోపే ఆయన పని పూర్తి చేసారు.

**చివరికి వైభవం :**

ప్రయాణంలో చివరిభాగం వైభవం ఎందుకయిదంటే, ఆయన కృపతో నా లోపల ఏదో మృదువుగా మారింది. నా ప్రయాణాన్ని నేను నియంత్రించాలనే ప్రయత్నం ఆపి, పూర్తిగా ఎలాంటి షరతులు లేకుండా శరణాగతి చెందాను. నేను ఒకప్పుడు ఏ ఆనందం కోసం బయటి విషయాలపై ఆధారపడ్డానో, అదే ఆనందం సహజంగా, అకారణంగా నా హృదయంలోనుండి రావడం మొదలయ్యింది. శాంతితో కూడిన కాలం పెరుగుతూ వచ్చింది. అలజడులు తగ్గుతూ వచ్చాయి. మనసులో అలజడులు వచ్చినప్పుడు కేవలం నాన్నని స్మరించుకోవడం వలన అప్పటికప్పుడు మనసు చల్లబడేది.

మార్గం, సంఘర్షణ, విడిచిపెట్టడం ఇవన్నీ మనస్సును హృదయానికి తిరిగి తీసుకు రావడానికి ఉద్దేశించినవి అని అర్థం అయింది.

**అనుగ్రహం :**

ఒక రోజు మనసు ఒత్తిడికి, అలజడికి గురవుతూ అశాంతిగా ఉన్న క్షణంలో లోపల ఒక ప్రశ్న తలెత్తింది : "భగవంతుడు మీ కోరికను నెరవేర్చినట్లయితే, మీ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తే మీరు దానికి బదులుగా మీ శాంతిని ఇచ్చేస్తారా?"

సమాధానం వెంటనే వచ్చింది : "లేదు. శాంతి నేను కోరుకునే అన్నింటికంటే గొప్పది".

ఆ క్షణంలో మనస్సు నిశ్శబ్ధం అయింది, ఆలోచనలు కరిగిపోయాయి. తరువాత వచ్చిన శాంతి యొక్క ప్రవాహం అది విస్తారమైనది, లోతైనది, విస్తృతమైనది. అది నా ఉనికి యొక్క ప్రతిభాగాన్ని నింపింది. ఆ అనుభవం మాటలలో వర్ణించలేనిది. ఆ అనుభవం రాత్రంతా కొనసాగింది.

మరుసటి ఉదయం, నేను చాలా గాఢమైన, లోతైన దాన్ని అనుభవించాను. దానిని వర్ణించడానికి పదాలు సరిపోవు. నేను భయం లేకుండా, ప్రయత్నం లేకుండా – హద్దులు లేని సముద్రంలో మునిగిపోతున్నాను. చాలా లోతుగా వెళ్ళాను – తిరిగి రావల్సిన అవసరం

ఉందని కూడా అనిపించలేదు. ఇది నా జీవితంలో నేను అనుభవించిన ముక్తి అనుభవం – అది చాలా లోతైనది, చాలా విశాలమైనది. ఆ విశాలత్వంలో నేను నాన్న మాటలను గుర్తు చేసుకున్నాను.

ఉండటమే బ్రహ్మం – ఉండటమే చైతన్యం – ఉండటమే ఆత్మ.

"ఉండటం" అనేది తనంతట తానే దైవికమైనది. నేను ఉన్నాను మాత్రమే నిజం. నేను ఇది కాదు, నేను అది కాదు, నేను ఉన్నాను. అంతే!

నాన్న నాకు ఈ లోకంలో కెల్లా గొప్పదైన దానిని బహుమతిగా ఇచ్చారు. ఉండటం అనే బహుమతి, అకారణ శాంతి అనే బహుమతి, స్వతంత్ర ఆనందం అనే బహుమతి, ఆయన కృపతో పొంగిపొర్లుతున్న హృదయం అనే బహుమతి.

ఈ ప్రయాణంలో నేను ఏమి కోల్పోయానో తెలియదు – కానీ నేను పొందినది కొలవలేనిది, వర్ణించలేనిది, పోల్చలేనిది అని తెలుసు. ఈ రోజు నా హృదయం నిండింది – పూర్తి స్థిరమైన, నిశ్శబ్దమైన మరియు లోతైన సంతృప్తి. నా హృదయం ఆయన ఆశీర్వాదాలు మరియు ఆయన కృపతో పొంగిపొర్లుతోంది. ఈ విశ్రాంతిలో కృతజ్ఞత, అచంచలమైన శాంతి మాత్రమే ఉన్నాయి.

ఈ జన్మ నా తల్లిదండ్రుల బహుమతి. కానీ ఈ జీవితం, ఈ అంతర్గత స్వేచ్ఛ, ఈ స్థిరమైన శాంతి – నా గురువు యొక్క బహుమతి.

ఆయన భౌతికరూపం ఈ లోకం నుండి వెళ్ళే చివరిదశలో, నేను చివరిసారి ఆయన చేయి పట్టుకునే అదృష్టాన్ని పొందాను. ఆయన నా చేయి వదలలేదు, ఎప్పటికీ వదలరు. నాన్న శాశ్వతంగా నాతో ఉంటారు అనే ఒక సత్యం నాకు ఖచ్చితంగా తెలుసు. ఈ శరీరం జీవించినంత కాలం మరియు అది మరణించిన తరువాత – నేను ఆయన ప్రేమలో, శరణాగతిలో మరియు మౌనంలో...

**మౌనంలో ముగిసిన ప్రయాణం**

కృతజ్ఞతతో
**రోహిణి రాజు**
**(హైదరాబాదు)**

# NITYAM - LEELA

**(Dr. Usha, Hyderabad)**

Life began with a search for Truth — that which is permanent, eternal and forever.

Being born into a spiritually inclined family and growing up in the presence of saints and sages, the quest for Truth only deepened as I stepped into adolescence. Living in the midst of nature, with a heart that loved sunsets and evening skies, my mind often slipped into a state of tranquility… moments of pure, unalloyed peace.

Yet, sustaining that peace while being active in the world was not easy. The peace would descend, but it would also slip away. This struggle intensified my longing — and that was when my Guru, my God-Father, Nannagaru, entered my life, bringing clarity to the path and grace to the journey.

Through him came precious glimpses of the Truth — moments of effortless silence, peace, and bliss. But after some time, body-consciousness would arise again. When I asked Nannagaru about it, he simply said:

"It will reveal itself completely when the time is ripe. Until then, sadhana will happen effortlessly, and vasanas will burn away naturally."

From then on, dissolving the mind in his boundless, unconditional love became a natural and beautiful process. Nannagaru became the centre of my life; everything else slowly lost its importance. Life turned magical… for it became clear that I was not the doer — everything was unfolding by his will.

I travelled wherever he was — day or night didn't matter; distance

didn’t matter.

After completing my final-year BDS exams, I went to meet him, and he gave me teachings to be etched in my heart forever:

“**Everything in life is the gift of God** — your spiritual family, financial stability, education, devotion, sincerity, earnestness for Truth, and right understanding.”

“**Everything is the will of God**.”

He asked me to write these lines down, paste them on my shelf, and remember them always . and I obeyed!

Since Nanna held my life with total care and clarity, I simply obeyed him and lived exactly as he guided — only after he assured me that nothing he asked me to do would obstruct my spiritual path.

So I followed his word in everything: my BDS studies in Chidambaram, marrying the person he chose, bringing a child into this world at the right time, and even the smallest details of my worldly life.

For me, Destiny itself became Nanna’s will manifesting moment by moment.

My outer life and inner life — every step, every decision — were filled, shaped, and carried by him with unimaginable grace and miracle-like precision.

One of the most significant days of my life was the day Nanna looked deeply into my eyes — without a flicker of distraction — and delivered an entire public pravachan on Nityam and Leela while remaining fully focused on me. In that vast gathering, it felt as though only the two of us existed.

His grace dissolved my mistaken belief that Realization must be achieved only in seclusion, away from the world. Through his words and presence, I understood that the Truth can blossom even while living amidst people, duties, and responsibilities — as long as the mind stays anchored in its source.

Nanna, with the full force of his grace, shook me awake as if rubbing the Truth directly into my being.

He said with intensity, "Do you want only Nitya? You don't want Leela?!

**Nityam and Leela are two sides of the same coin called Consciousness. Leela is not separate from God-Consciousness. They are one and the same**."

Gathering all my courage, I finally asked him : "Nanna... unless I experience the state of Nitya alone the Oneness — and become firmly established in it without any trace of separation, only then can it truly be Leela. As long as separation exists, how can I call it Leela? Because separation itself is Maya... isn't it?"

At that moment, Nanna's face lit up with joy.

With immeasurable compassion, he blessed me and said: "Very good, very good! Your understanding is clear. Yes — as long as there is separation, it is Maya. But in reality, there was never any separation. There is no inside or outside — it is all ONE!"

He continued : "As long as the illusion of separation lingers, the world and society appear real. But once it is experienced that there is no separation — there is no knower and no known — There will be only abiding as the True self ("One with the Universal Self!")

Brahmam alone exists!!

ఓం శ్రీ నాన్నపరమాత్మనే నమః

# నిత్యం - లీల

డా॥ ఉష, హైదరాబాదు

సత్యాన్వేషణతో నా జీవితం ప్రారంభమైంది.

శాశ్వతమైనది, నిత్యమైనది ఎప్పటికీ నిలిచేది సత్యం!

ఆధ్యాత్మిక కుటుంబంలో జన్మించి, సాధు సన్యాసుల సమక్షంలో పెరిగి, యవ్వనంలోకి అడుగు పెట్టేసరికి, సత్యం కోసం అన్వేషణ మరింత లోతుగా కొనసాగింది. ప్రకృతిని ప్రేమిస్తూ, సాయంకాలపు సమయంలో ఆకాశాన్ని, పక్షులను, పరిసరాలను, సూర్యాస్తమయాన్ని గమనిస్తూ ఆలోచనలు లేని స్థితిలో నా మనస్సు తరచూ ప్రశాంతతలోకి జారుకునేది... ఆ స్థితి నా లోపల ఉన్న చైతన్యం తాలూక అనుభవమని నాకు అప్పుడు తెలియదు. అయితే, లోకంలో చురుకుగా వ్యవహరిస్తూ శాంతిని నిలుపుకోవడం సులభం కాదు. నాలో శాంతి ఆవరించేది కానీ, మళ్ళీ జారిపోయేది. ఈ పోరాటం నా తపనను తీవ్రతరం చేసింది.

అప్పుడే నా గురువు, నా భగవంతుడు అయిన నాన్నగారు నా జీవితంలోకి వచ్చారు. మార్గానికి స్పష్టత తెచ్చారు. ప్రయాణానికి అనుగ్రహం తోడయ్యింది. ఆయన దయవల్ల సత్యం యొక్క అమూల్యమైన అనుభవాలు కలిగాయి. అప్రయత్నంగా మౌనం, శాంతి, ఆనందం అనుభవంలోనికి వచ్చేవి. కానీ కొంత సమయం తరువాత మళ్ళీ దేహాభిమానం మేల్కొనేది. దీని గురించి నాన్నగారిని అడిగినప్పుడు, ఆయన ఇలా చెప్పారు : “భగవంతుడు నీ తపనకి సత్యం యొక్క రుచి చూపించాడు. సమయం పరిపక్వమైనప్పుడు సత్యం పూర్తిగా వెల్లడవుతుంది. అప్పటివరకు సాధన అప్రయత్నంగా జరుగుతుంది. వాసనలు సహజంగా రాలిపోతాయి. సత్యం యొక్క అనుభవం ఎవరికైతే కలిగిందో, అది అక్కడితో ఆగిపోదు. సాధన అప్రయత్నంగా జరుగుతుంది”.

అప్పటి నుండి ఆయన అపరిమితమైన, హద్దులులేని ప్రేమలో మనస్సు కరగడం సహజమైన, అందమైన ప్రక్రియగా మారింది. నాన్నగారు నా జీవితానికి కేంద్రం అయ్యారు. మిగిలినవన్నీ నెమ్మదిగా ప్రాముఖ్యత కోల్పోయాయి. జీవితం దైవికమైన అనుభవాలతో అద్భుతంగా మారింది. ఎందుకంటే, నేను కర్తను కాననే విషయం స్పష్టమైంది. ప్రతీదీ

ఆయన సంకల్పంతో జరుగుతోందని అర్థమయ్యేది.

ఆయన ఎక్కడ ఉంటే అక్కడికి పగలు, రాత్రి అనే తేడా తెలియకుండా, దూరంతో సంబంధం లేకుండా ఆయన సమక్షానికి చేరుకునేదాన్ని.

నా BDS చివరి సంవత్సరం పరీక్షలు పూర్తయిన తరువాత ఆయన్ని కలవడానికి వెళ్ళినప్పుడు, ఆయన నా హృదయంలో శాశ్వతంగా నిలుపుకోవలసిన రెండు విలువైన అంశాలను బోధపరిచారు.

"**జీవితంలో ప్రతీదీ భగవంతుని బహుమానం**. నీ ఆధ్యాత్మిక కుటుంబం, ఆర్థిక స్థిరత్వం, విద్య, భక్తి, చిత్తశుద్ధి, సత్యం కోసం తీవ్ర కాంక్ష, సరైన అవగాహన... ఇవి అన్నీ భగవంతుడు నీకు ఇచ్చిన వరాలు. '**ప్రతీదీ ఈశ్వరసంకల్పంతోనే జరుగుతోంది**' ఈ వాక్యాలను కాగితంపై వ్రాసి నీ షెల్ఫ్ పై అతికించుకో.... వీటిని ఎల్లప్పుడూ జ్ఞాపకం పెట్టుకో" అని చెప్పారు.

ఆయన చెప్పింది పాటించాను. నాన్న నా జీవితాన్ని పూర్తి శ్రద్ధతో, స్పష్టతతో మలిచారు. కాబట్టి, నేను ఆయన చూపిన మార్గాన్ని మాత్రమే అనుసరించాను. ఆయన మాట ప్రకారమే జీవించాను. ఆయన నన్ను భౌతికంగా, వ్యవహారికంగా ఏది చేయమని చెప్పినా అది నా ఆధ్యాత్మిక మార్గానికి ఆటంకం కాదని భరోసా ఇచ్చిన తరువాతే చేసాను.

చిదంబరంలో నా BDS చదువు, ఆయన ఎంపిక చేసిన వ్యక్తిని పెళ్ళి చేసుకోవడం, సరైన సమయంలో ఒక బిడ్డను కనడం, డెంటల్ ప్రాక్టీసు చెయ్యడం మరియు నా ప్రాపంచిక జీవితంలోని ప్రతి చిన్న విషయం కూడా ఆయన నిర్ణయం ప్రకారమే జరిగింది.

"నాన్న సంకల్పమే క్షణక్షణం వ్యక్తమవుతున్న నా విధి అయ్యింది".

నా బాహ్య జీవితం, అంతరంగ జీవితం, ప్రతీ అడుగు, ప్రతీ నిర్ణయం ఊహించలేని అనుగ్రహంతో మరియు అద్భుత సామర్థ్యంతో ఆయనచే రూపొందించబడ్డాయి. లోకాన్ని, వ్యవహారిక ప్రపంచాన్ని త్యజించి, ఏకాంతంగా జీవించే వాళ్ళకి మాత్రమే ఆత్మసాక్షాత్కారం సాధ్యమవుతుంది అనే నా అపోహను, ఆయన సమక్షంలో ఆయన మాటలతో తొలగించారు. మనసుకి పవిత్రత, భగవంతుని పట్ల నిరంతర చింతన కలిగి ఉన్నప్పుడు, ప్రాపంచిక వ్యవహారాల మధ్య ఉన్నా కూడా సత్యం వికసించగలదని అర్థమయ్యేలా చేసారు.

నాన్న ఆయన నిండు అనుగ్రహంతో, సత్యం గురించి పదే పదే బోధిస్తూ నా హృదయాన్ని నింపి, నన్ను అజ్ఞానంలోంచి మేల్కొల్పారు.

నా జీవితంలో అత్యంత ముఖ్యమైన రోజుల్లో ఒకటి – నిత్యం మరియు లీల గురించి చెబుతూ ఒక ప్రవచనం మొత్తంలో నా పైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించారు. ఆ విశాలమైన సమావేశంలో మేమిద్దరమే ఉన్నట్లు అనిపించింది.

నాన్న నా కళ్ళలోకి లోతుగా చూస్తూ – "నీకు నిత్యం మాత్రమే కావాలా? లీల వద్దా?" అని ప్రశ్నించారు.

నేను మౌనంగా ఉన్నాను. ఆయన నా వైపు చాలా తీక్షణంగా చూస్తూ మళ్ళీ మళ్ళీ ప్రశ్నించారు.

**ఒక నాణానికి రెండు వైపుల ఉన్నట్టే – చైతన్యానికి ఒకవైపు నిత్యం, మరొకవైపు లీల ఉన్నాయి. లీల నిత్యానికి భిన్నం కాదు. నిత్యం, లీల అనేవి వేరు కాదు. రెండూ ఒక్కటే అన్నారు.**

నేను మెల్లగా ధైర్యం తెచ్చుకుని చివరకు – "నాన్నగారూ..... ఏకత్వం అనేది నాకు అనుభవంలోనికి వచ్చి అక్కడ స్థిరపడేవరకు నేను ప్రపంచాన్ని లీలగా ఎలా చూడగలను? అది మాయగానే నాకు గోచరిస్తోంది కదా? ఎప్పుడైతే ద్వైతభావం వచ్చిందో, ద్వైతమే మాయ అయినప్పుడు నేను దాన్ని లీలగా ఎలా చూడగలుగుతాను?" అని అడిగాను.

ఆ క్షణంలో నాన్న ముఖం ఆనందంతో వికసించింది. అపారమైన కరుణతో నన్ను ఆశీర్వదిస్తూ "చాలా బాగుంది, చాలా బాగుంది. నువ్వు బాగా అర్థం చేసుకున్నావమ్మా" అన్నారు. వేరుభావన ఉన్నంతకాలం అది మాయగానే గోచరిస్తుంది. కానీ వాస్తవానికి వేరు భావన అనేది అసలు లేదు. లోపల, వెలుపల అనేది లేదు. ఉన్నది ఒక్కటే వస్తువు అని చెప్పి ఇలా కొనసాగించారు – ఏదైతే వేరుభావన ఉందని నువ్వు అనుకొంటున్నావో, ఆ వేరు భావనకి అసలు అస్థిత్వం లేదు. అది కేవలం అపోహ మాత్రమే! వేరుభావన ఉన్నంతకాలము ప్రపంచము, సంఘము అన్నీ నిజంగానే గోచరిస్తాయి. కానీ, ఒక్కసారి వేరు లేదు అన్న విషయం అనుభవంలోకి వచ్చినప్పుడు చూసేవాడు, చూడబడేవాడు కూడా ఉండడు. అప్పుడు సత్యం సత్యంగా గోచరిస్తుంది. అప్పుడు నువ్వు నువ్వుగా ఏకంగా ఉంటావు.

**ఉన్నది బ్రహ్మమొక్కటే!**

# కాలము భగవంతుని స్వరూపము

మనము మరొక నూతన సంవత్సరము 2026కి స్వాగతం పలుకుతున్నాము. కాలము పరమాత్మ స్వరూపము. కాలము ఎవరికోసమూ వేచియుండదు, అది ఒక ప్రవాహము, నిరంతరము ముందుకు సాగుతూనే ఉంటుంది. దేహము పుట్టుకనుండి మరణము వరకు సాగే ప్రయాణమే – వ్యక్తి యొక్క జీవితంగా పిలువబడుతోంది. కాలము అన్నిటినీ సృష్టిస్తుంది, అట్లే అన్ని జీవరాసులను తనలో లయం చేసుకుంటుంది, తిరిగి సృష్టికి ప్రాణం పోస్తుంది. "సూర్యుని ఉదయాస్తమయములచే రోజు రోజుకు ఆయువు తరిగి పోతోంది. విషయ చింతనలో మునిగి తేలుచూ జనులు ఆ విషయమును గుర్తెరగకున్నారు. పుట్టువారిని, మరణించువారిని చూచి భయపడకున్నారు. అజ్ఞానమునకు వశమై మతి తప్పియున్నారు" అన్నారు శ్రీభర్తృహరి. వాస్తవంగా నేనెవరో? తెలిసికొనుటకు చేసే ప్రయత్నమే నిజమైన ప్రయత్నము, మిగిలిన ప్రయత్నాలన్నీ మన మనస్సు ఎంత నిజమో అవీ అంతే నిజం. కాబట్టి వ్యర్థ ప్రయత్నాలతో కాలాన్ని వృధా చేసుకోకూడదు. మన జీవిత గమ్యం అమృతానుభవాన్ని పొందడం. అట్టి అమృతానుభవాన్ని పొందడానికి మన ప్రయత్నముతోపాటు, గుర్వనుగ్రహం తోడవ్వాలి. గుర్వనుగ్రహానికి పాత్రులము అవ్వాలంటే చిత్తశుద్ధిని సాధించాలి. అట్టి చిత్తశుద్ధిని మనము త్రికరణాలకు ఇచ్చే శిక్షణ ద్వారా సాధించగలము. అభ్యాసము లేని విద్య నిరర్థకము, ధృవీకరణకు నిలబడేదే విద్య. కేవలం విషయ సేకరణ మాత్రమే విద్య కాదు. అభ్యాస, వైరాగ్యముల వలన స్వరూప జ్ఞానం కలుగుతుంది. బంధరాహిత్యాన్ని, నిరంతర జాగరూకతను అభ్యాసం చేయాలి. మనకు ఎదురయ్యే ప్రతీ సంఘటన జ్ఞానోదయాన్ని కలిగించేదిగా ఉండాలి మరియు ఆధ్యాత్మిక వికాశాన్ని కలిగించాలి. సముద్రం అందరికీ ఒక్కటే! కానీ ఈత వచ్చిన వారికి లోలోపల మునగ గలిగిన వారికి ముత్యాలు దొరుకుతాయి; వల వేయడం వచ్చినవారికి చేపలు దొరుకుతాయి; ఒడ్డున నిలబడి చూచేవారికి కాళ్ళు మాత్రమే తడుస్తాయి. ఈ మానవ జీవితమూ అంతే! అందరికీ ఒక్కటే జీవితం కాకపోతే అహంకారాన్ని పోగొట్టుకోవటానికి మన ప్రయత్నం ఎంత బలంగా ఉంటే అంత వేగముగా అద్వైతానుభవాన్ని పొందుతాం. కేవలం పాత సంవత్సరానికి వీడ్కోలు పలకడమే కాకుండా అనాదిగా మనలను పీడిస్తున్న విషయ వాసనలకు, అహంకారానికి వీడ్కోలు పలకాలి. అందుకు సత్సంగము, సజ్జన సాంగత్యము, స్వరూపచింతన తోడ్పడతాయి. భగవాన్ శ్రీరమణులు, సద్గురు శ్రీనాన్నగారు నిత్య వర్తమానంలో జీవించేవారు, వారు కాలములో కాలాతీతులు. ఒక కాలములో పరమాత్మచేత ప్రసాదించబడిన ఈ మానవ శరీరమును, కాల రూపములో ఉన్న ఈ మానవ జీవితాన్ని సద్వినియోగం చేసుకొని, గుర్వనుగ్రహానికి పాత్రులమై అమృతానుభవాన్ని పొందాలి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**